RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



18 మార్చ్ 2025 మంగళవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:246

# బలహీబలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు

## ప్రధాని మోదీ ని కలవడానికి ప్రయత్నిద్దాం ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ని కలిసి పార్లమెంట్ లో ఈ అంశాన్ని చర్చించడంతో పాటు సహకరించాలని కోరుదాం :సీఎం రేవంత్‌రెడ్డి

**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:**బలహీబలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అందుకు నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే వరకు విశ్రమించేది లేదని శాసనసభ వేదికగా స్పష్టం చేశారు.

బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, అలాగే రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సంబంధించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో ప్రతిపాదించిన రెండు వేర్వేరు బిల్లులపై ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఈ విషయంలో రాజకీయ పార్టీల నాయకులందరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలుద్దామని చెప్పారు. అందుకు ప్రధాన ప్రతిక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తో పాటు అందరం కలిసికట్టుగా కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళదామని అన్నారు.


ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వీలైనంత తొందరగా ప్రధాని మోదీ ని కలవడానికి ప్రయత్నిద్దామని చెబుతూ, అందుకు సంబంధించి వారి అపాయింట్ మెంట్ కోరుతూ లేఖ రాయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని ఆదేశించారు. ప్రధానమంత్రి తో పాటు లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ని కలిసి అన్ని విషయాలు వివరించి పార్లమెంట్ లో ఈ అంశాన్ని చర్చించడంతో పాటు సహకరించాలని కోరుదామని అన్నారు.

శాసనసభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లుకు మద్దతుగా రాజకీయాలకు అతీతంగా, సిద్ధాంతాలకు అతీతంగా జెండాలు, ఎజెండాలకు అతీతంగా బలహీన వర్గాలకు అండగా ఏకాభిప్రాయంతో నిలబడ్డాయని ఒక సందేశాన్ని పంపించడంలో సహకరించినందుకు ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు.


శాస్త్రీయ పద్ధతిలో బీసీల గణాంకాలు తేల్చకుండా రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని సుప్రీంకోర్టు చెబుతున్నందున, దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో పారదర్శకంగా ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేను చేసి లెక్కలు తేల్చిందని వివరించారు.

బీసీ కులగణన విషయంలో 4 ఫిబ్రవరి 2024 మంత్రిమండలి తీర్మానంతో ప్రారంభించి సరిగ్గా ఏడాది పూర్తయ్యేలోగా తిరిగి 4 ఫిబ్రవరి 2025 న శాసనసభలో తీర్మానం ఆమోదించే వరకు జరిగిన ప్రక్రియను ముఖ్యమంత్రి వివరించారు. అందుకు గుర్తుగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 4 న సోషల్ జస్టిస్ డేగా నిర్వహించుకోవాలని శాసనసభ ఆమోదించిన విషయాన్ని గుర్తుచేశారు.

'ప్రభుత్వం నిర్వహించిన సర్వే తేల్చిన లెక్క నూటికి నూరు శాతం కరెక్ట్. ఈ సర్వే ప్రకారం బలహీనవర్గాలు 56 శాతం ఉన్నట్టు తేలింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గతంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. ఇప్పుడు బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా చట్టబద్ధత కల్పిస్తున్నాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునే వరకు విశ్రమించేది లేదు" అని అన్నారు.



# తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీ సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్పు




**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:**రాష్ట్ర విభజన అనంతరం పరిపాలనా సౌలభ్యం, రెండు రాష్ట్రాల్లో సంస్థలకు ఒకే పేరు కారణంగా ఎదురవుతున్న గందరగోళానికి తెరదించాలన్న ఉద్దేశంతో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప రెడ్డి పేరును పెడుతున్నట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత పదేళ్లుగా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, విధివిధానాలు పరిశీలించిన తర్వాత తెలుగు విశ్వవిద్యాలయ పేరు మార్పును ప్రతిపాదించామని చెప్పారు.

శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీ సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్పు చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుపై శాసనసభలో ముఖ్యమంత్రి స్పందించారు.

పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మ గాంధీ గారి స్ఫూర్తితో పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాల ద్వారానే మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిందని గుర్తుచేశారు. పొట్టి శ్రీరాములు పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. వారి దేశభక్తి, ప్రాణత్యాగం మరువలేనిదని అన్నారు.

"తెలంగాణ ఏర్పాటుకు కృషి చేసిన ప్రముఖులను మనం స్మరించుకుంటున్నాం, వారి పేర్లను మన విద్యా సంస్థలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు పెట్టుకుంటున్నాం. ఈ విషయంలో కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయడం మంచిది కాదు.

రాష్ట్ర విభజన తర్వాత ఆయా భౌగోళిక ప్రాంతాల్లో ఉన్న యూనివర్సిటీలు ఆయా రాష్ట్రాల పరిధిలోకి వెళ్లగా, ఆ ప్రక్రియలో భాగంగా యూనివర్సిటీలకు కొత్త పేర్లు పెట్టుకోవడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా ఉండగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ గారి పేరు కొనసాగిస్తున్నారు. తెలంగాణలో దానికి శ్రీ కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీగా నామకరణం చేసుకున్నాం.

ఇలా మార్చడం వల్ల ఎన్టీఆర్ ని అగౌరవపరిచినట్టు కాదని, రెండు రాష్ట్రాల్లో ఒకే పేరుతో యూనివర్సిటీలను కొనసాగిస్తే పరిపాలనలో గందరగోళం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో హెల్త్ యూనివర్సిటీ పేరును కాళోజీ నారాయణరావు పేరును పెట్టుకున్నాం.

ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా నామకరణం చేసుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న వ్యవసాయ వర్సిటీ రంగా పేరుతో కొనసాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్‌లో యధాతథంగా కొనసాగుతుండగా, తెలంగాణలో హార్టికల్చర్ వర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ కొనసాగుతుండగా తెలంగాణలో వెటర్నరీ యూనివర్సిటీకి స్వర్గీయ పీవీ నరసింహారావు పేరును పెట్టుకున్నాం. ఈ కోవలోనే రాష్ట్ర విభజన తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు పేరుతో కొనసాగుతుండగా, తెలంగాణలో సురవరం ప్రతాప రెడ్డి పేరును ప్రతిపాదించాం. ఈ మార్పు ఒక వ్యక్తి కోసమో, కుటుంబం కోసమో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదు. మిగతా యూనివర్సిటీలకు పేర్లను ఎలా మార్చుకున్నామో అదే తరహాలో తెలుగు విశ్వవిద్యాలయానికీ మార్పు ప్రతిపాదన చేశాం. ఆరోజుల్లో తెలంగాణకు అసలు భాషనే లేదని అవహేళన చేసిన సందర్భంలో 354 మంది తెలంగాణ కవుల సంచికగా గ్రంధాన్ని తీసుకొచ్చారు. గోల్కొండ పత్రికను ప్రారంభించి ఆనాడు తెలంగాణ ఉద్యమాన్ని సురవరం ప్రతాప రెడ్డి ముందుండి నడిపించారు.

రాష్ట్ర విభజన తర్వాత ఏపీఎస్ ఆర్టీసీని టీజీఆర్టీసీగా, ఏపీఐఐసీని టీజీఐఐసీగా, ఏపీపీఎస్సీని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా మార్చుకున్నాం. తెలంగాణ ఏర్పడిన తర్వాత పరిపాలనలో భాగంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న ఉద్దేశంతో యూనివర్సిటీల పేర్లకు మార్పులు చేశాం.

ఈ నిర్ణయాల్లో ఎవరినో కించ పరచాలన్న ఉద్దేశం కాదు. పరిపాలన పరంగా ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని, రాష్ట్ర విశాల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. పొట్టి శ్రీరాములు , మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ రోశయ్య పట్ల, ఆర్యవైశ్య సమాజం పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, నమ్మకం, విశ్వాసం ఉంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారితో కలిసి ఇటీవల చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఒక హబ్‌గా తీర్చిదిద్దుకున్న నేపథ్యంలో ఆ స్టేషన్‌కు పొట్టి శ్రీరాములు పేరును పెట్టి ఆ ప్రముఖుడి త్యాగాలను స్మరించుకుందాం. ఈ విషయంలో రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి గారు, బండి సంజయ్ గారు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి.

అలాగే, ప్రముఖ నాయకులు రోశయ్య హైదరాబాద్‌లో నివాసమున్న ఇంటికి సమీపంలోని బల్కంపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయానికి రోశయ్య గారి పేరును పెట్టాలని ప్రతిపాదిస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన సుదీర్ఘ అనుభవజ్ఞులు, ముఖ్యమంత్రిగా గవర్నర్‌గా ఎనలేని సేవలు అందించిన రోశయ్య పేరును పెట్టడం సమంజసం. రోశయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా చేస్తున్న నేపథ్యంలో ఆ చికిత్సాలయంలో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం. తద్వారా వారి సేవలను ఎల్లప్పుడూ స్మరించుకోవచ్చు. ఈ రెండు చర్యల ద్వారా ఆర్యవైశ్యుల పట్ల ఉన్న ప్రత్యేక అభిమానాన్ని నిరూపించుకుందాం…" అని ముఖ్యమంత్రి చెప్పారు.




## అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ లకు పాల్పడినా, ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించిన చట్టరిత్య చర్యలు తప్పవు. నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** యువత,విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్‌లకు అలవాటు పడి, సైబర్ మోసగాళ్ళు పన్నిన ఉచ్చులో పడి, డబ్బులు కోల్పోయి అప్పులపాలై, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ లకు పాల్పడిన, ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడిన, ప్రోత్సాహించిన అట్టి వ్యక్తులపై చట్టరిత్య చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పత్రిక ప్రకటన లో తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పి పత్రిక ప్రకటన జారి చేసారు.

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చున్న భ్రమలో యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్ లకు బానిసలుగా మరి, అప్పులపాలపై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని, అన్నారు.ఆన్లైన్ బెట్టింగ్/గేమ్స్ కట్టడికి జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ లకు పాల్పడినా.ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించిన చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్పీ తెలియజేసారు.

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ ల నిర్వహకులు సూచనల మేరకే ఆపరేట్ చేయబడతాయని, బెట్టింగ్ యాప్ లలో డబ్బులు పెట్టుబడిగా పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ మాటున ప్రమాదకర మాల్ వేర్ ఉందని, ఫెక్ లింక్స్ తో వ్యక్తి గత సమాచారం,అకౌంట్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్ళే అవకాశం ఉన్నందని, గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండి,మీ చుట్టూ ప్రక్కల ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే 100 డైల్ లేదా మీ సమీప పోలీసు స్టేషన్ నందు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుంది అన్నారు

ప్రజాబలం

18 మార్చ్ 2025 మంగళవారం

# ఈ దారుణాలకు అంతం లేదా..

దేశంలో కశ్మీర్‌నుంచి కన్యాకుమారి వరకు ఎన్నో చారిత్రక పర్యాటక ప్రాంతాలున్నాయి. వీటిని సందర్శించడానికి విదేశాల నుంచి కొన్ని వేల మంది పర్యాటకులు వస్తుంటారు. భారత పర్యాటకరంగం ప్రస్తుతం 250 బిలియన్ డాలర్ల ఆదాయంతో వర్ధిల్లుతుండగా, మరో పదేళ్లకు 523 బిలియన్ డాలర్ల వరకు వృద్ధి చెందుతుందని అంచనా. 2023లో విదేశీ పర్యాటకులు 9.24 మిలియన్ల మంది వరకు అరుదెంచగా, 2028 నాటికి ఈ సంఖ్య 30.5 మిలియన్లకు చేరుతుందని అంచనా. 2034 నాటికి జిడిపికి రూ. 43,25,000 వరకు ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు. ఈ అద్భుతమైన అంచనాలు సాకారం కావాలంటే స్వదేశీ, విదేశీ పర్యాటకులకు తగిన ఆతిథ్యం నుంచి భద్రత వరకు వివిధ సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎలాంటి భయాందోళనలకు, అఘాయిత్యాలకు గురికాకుండా పర్యాటకులు స్వేచ్ఛగా, నిర్భయంగా చారిత్రక, సుందర ప్రదేశాలను సందర్శించే ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే పర్యాటకులు తమ జీవితాంతం ఈ జ్ఞాపకాలను గుర్తు పెట్టుకోగలుగుతారు. కానీ గత రెండు మూడేళ్లుగా విదేశీ పర్యాటకులపై ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుండడం భారత పర్యాటక రంగాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్నాయి. దక్షిణాదిలోని హంపీ విజయనగర సామ్రాజ్య చారిత్రక ఆనవాళ్లు ప్రపంచ చరిత్రలో చెప్పుకోదగినవి. 14 వ శతాబ్దం నుంచి 16 వ శతాబ్దం వరకు విజయనగర వైభవం వర్ధిల్లింది. ఆ సామ్రాజ్య పరిపాలకుల్లో శ్రీకృష్ణదేవరాయలు కీర్తి చిరస్మరణీయం. ఆనాటి కట్టడాల శిథిలాలను సందర్శించడానికి విదేశాల నుంచి విశేష సంఖ్యలో టూరిస్టులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో మార్చి 6 వ తేదీ రాత్రి టూరిస్టులపై జరిగిన అఘాయిత్యం సంచలనం కలిగించింది. ఇజ్రాయెల్ నుంచి వచ్చిన టూరిస్టు యువతి, అమెరికా టూరిస్టు డేనియల్, నాసిక్‌కు చెందిన టూరిస్టు పంకజ్, ఒడిశాకు చెందిన బిబ్బాస్, స్థానిక హోమ్‌స్టే యజమానురాలు హంపీ సమీపంలో అనెగొంది ప్రాంతంలో మార్చి 6 వ తేదీ రాత్రి నక్షత్రాలను సందర్శించడానికి వెళ్లగా వీరిపై దుండగులు దాడి చేశారు. ఇజ్రాయెల్ టూరిస్టు యువతిపైన, హోమ్‌స్టే యజమానురాలిపైన ముగ్గురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వారి వద్ద ఉన్న రూ. 9500 నగదు, రెండు మొబైల్ ఫోన్లను కాజేశారు. ఈ బృందంలో ఉన్న ముగ్గురు పురుషులపై దాడి చేసి వారిని తుంగభద్ర కాలువలోకి తోసేశారు.డేనియల్, పంకజ్ ప్రాణాలతో బయటపడగా బిబ్బాస్ మృతదేహం తరువాత బయటపడింది. కొప్పల్ ప్రాంతంలోని సనపుర సరస్సువద్దకు రాత్రి పూట నక్షత్రాలను సందర్శించడానికి సాధారణంగా ఎవరూ వెళ్లరని, అక్కడ చిరుత పులులు, ఎలుగుబంట్లు ఎక్కువగా సంచరిస్తుంటాయని స్థానికులు చెప్పారు. ఈ దుర్ఘటన హంపీ క్షేత్ర పర్యాటక చరిత్రలో విషాద ఘట్టంగా మిగిలింది. హంపీ సర్కిల్ ఆర్కియాలజీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 202425 డిసెంబర్ వరకు 5.8 లక్షల స్వదేశీ టూరిస్టులు, 9357 మంది విదేశీ టూరిస్టులు హంపీని సందర్శించడానికి రాగా, వీరిలో ఇజ్రాయెల్, ఐరోపాకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. ఏటా హోలీ వేడుక జరుపుకోవడానికి హంపీకి టూరిస్టులు భారీ సంఖ్యలో వస్తుంటారు. కానీ ఈసారి టూరిస్టుల సంఖ్య బాగా తగ్గింది. అత్యాచార సంఘటన కూడా దీనికి కారణం కావచ్చు. హంపీ ప్రాంతంలో అనధికార అతిథి గృహాలు ఎక్కువగా నడుస్తున్నాయి. 2020 లో తుంగభద్ర నదిలోని విరుపాపుర గడ్డి ద్వీపంలో ఏర్పాటైన అక్రమ రిసార్టులను అధికారులు కూల్చివేశారు. ఇక్కడ విస్కీ పార్టీలు, డ్రగ్ వినియోగం భారీగా జరుగుతోందని స్థానికులనుంచి ఫిర్యాదులు కూడా పోలీసులకు అందుతున్నాయి. హంపీ ప్రాంతంలో టూరిస్టులపై అత్యాచార సంఘటన మరువక ముందే హంపీ ప్రాంతంలోనే మరో ఇజ్రాయెల్ టూరిస్టు మహిళపై అత్యాచారం జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇదిలా ఉండగా, భారత పర్యటనకు వచ్చిన ఓ బ్రిటిష్ మహిళపై ఢిల్లీలోని హోటల్‌లో ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన జరిగింది. మహారాష్ట్ర, గోవాలో పర్యటించడానికి బాధితురాలు గత నెలలో భారత్‌కు చేరుకున్నారు. కొద్ది రోజుల పాటు ముంబైలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో కైలాస్ అనే 24 ఏళ్ల వ్యక్తితో పరిచయం అయింది. తనను కలిసేందుకు ఢిల్లీ రావాలని కైలాస్ కోరడంతో ఆమె ఢిల్లీ చేరుకున్నారు. మహీపాల్ పుర్ ప్రాంతంలో ఓ హోటల్‌లో గది తీసుకున్నారు. తొలుత ఆ రాత్రి హోటల్‌లో పనిచేసే వ్యక్తి లిఫ్ట్‌లో తనపై లైంగికంగా దాడి చేశాడని, ఆ తర్వాత కైలాస్ అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2024 మార్చిలో జార?ండ్‌లోని దుమ్‌కా జిల్లా లో భారత్‌లో పర్యటించడానికి వచ్చిన స్పెయిన్ దంపతులపై దుండగులు దాడి చేయడమేకాక, స్పెయిన్ మహిళపై అత్యాచారం జరపడం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. బీహార్ మీదుగా నేపాల్ బయలుదేరిన వీరు ప్రపంచ యాత్రకు సిద్ధం అయ్యారు. దారిలో ఓ ప్రాంతంలో తాత్కాలిక గుడారంలో ఉన్న ఆమెపై స్థానిక యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిపై ప్రపంచ దేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ దారుణంపై జార?ండ్ అసెంబ్లీలో తీవ్ర దుమారం రేగింది. మొత్తం ఏడుగురు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే దేశంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు తగిన భద్రత ప్రశ్నార్థకంగా తయారైంది. దేశం మొత్తం మీద శిక్షణ పొందిన, రిజిస్టర్ అయిన టూరిస్టు గైడ్లు ఉన్నప్పటికీ, ప్రత్యేక పోలీస్ బలగాల రక్షణ మాత్రం లోటుగా కనిపిస్తోంది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్రం కూడా పర్యాటక ప్రదేశాలకు తగిన భద్రత కల్పించవలసిన అవసరం ఉంది.

## ప్రజావాణి సమస్యల పరిష్కారంలో జాప్యం చేయరాదు: అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు

### జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 165 అర్జీలు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17:** ప్రజావాణి సందర్భంగా ప్రజల నుండి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయరాదని జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి అడిషనల్ సి సి గంగాధర్ పాల్గొని నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి అక్కడిక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా శివ కుమార్ నాయుడు మాట్లాడుతూ... నగర ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు విశేష కృషి చేయాలన్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యల పై ఎన్ని రోజుల్లో పరిష్కారం చేస్తారో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా సమాధానం పంపించాలని అధికారులను ఆదేశించారు.

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 85 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 36, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్ విభాగం 8, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్ విభాగాలకు మూడు చొప్పున, యు.సి.డి, ఎలక్ట్రికల్, అడ్వర్టైజ్ మెంట్, స్పోర్ట్స్ విభాగాలకు రెండు చొప్పున, సి.టి.ఓ, హెల్త్, లేక్స్, ల్యాండ్ అక్విజిషన్, ఎస్టేట్స్, వెటర్నరీ, ఆర్.టి.ఐ సిపిఆర్ఓ, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి.

జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 80 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 31, సికింద్రాబాద్ జోన్ లో 20, శేరిలింగంపల్లి



జోన్ లో 20, ఎల్బీనగర్ జోన్ లో 4, చార్మినార్ జోన్ లో 3, ఖైరతాబాద్ జోన్ లో 2 అర్జీలు అందాయి.

ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ సి సీ పీ , ప్రదీప్, వాటర్ వర్క్స్ జిఎం సాయి రమణ, డిప్యూటీ సి ఈ పనస రెడ్డిహౌసింగ్, ఈ ఈ రాజేశ్వర్ రావు, పి వి రమణ రావు ఎస్ యన్ డి పి %ఱ%ఈ ఈ వెంకటేశ్వర రావు ఏ ఈ ఈ బాలాజీ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, వాల్యూయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, యు బి డీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు,ఓఎస్ డి అనురాధ, ఏ ఎం సీ లు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "రాజీవ్ యువ వికాసం"

### జూన్ 2 వ తేదీన 5 లక్షల మంది లబ్దిదారులను ప్రకటిస్తాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి






**ప్రజాబలం ప్రతినిధి** రాష్ట్రంలో ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఆలోచనతో 6 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం "రాజీవ్ యువ వికాసం" కార్యక్రమాన్ని చేపట్టిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. స్వయం ఉపాధి కింద అసలైన, అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ పథకం ప్రయోజనం చేకూరాలని స్పష్టం చేశారు. జూన్ 2 వ తేదీన 5 లక్షల మంది లబ్దిదారులను ప్రకటిస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులకు ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమాన్ని శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో పాటు మంత్రివర్గ సహచరులు, ఆయా రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధుల సమక్షంలో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారు.

అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, పథకం ప్రధాన ఉద్దేశాలను విడమరిచి చెప్పారు. "నైపుణ్యం ఉండీ ఉద్యోగం లభించని యువతకు ఈ పథకం కింద ప్రాధాన్యత కల్పించాలి. పారదర్శకంగా ఉండాలి. అర్హులు, నిజమైన నిరుద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఉద్దేశించిన ఈ పథకం ముందు ముందు మరింత పటిష్టంగా అమలు చేస్తాం. అర్హులైన యువతీ యువకులను ఎంపిక చేయడానికి ప్రజా ప్రతినిధులు మండలాల వారిగా సమావేశాలు నిర్వహించుకోవాలి. ఈ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 4 నుంచి 5 వేల మందికి ఉపాధి కల్పించవచ్చు.

ఈ పథకం ద్వారా అర్హత ఉన్న వారికి 50 వేల నుంచి 4 లక్షల వరకు సహాయం అందించవచ్చు. ఇవ్వగలిగిన చోట ఉద్యోగాలు ఇస్తున్నాం. అవకాశాలున్న చోట ఉపాధి కల్పిస్తున్నాం. నైపుణ్యాన్ని నేర్పించాల్సిన చోట వృత్తి నైపుణ్య శిక్షణనిస్తున్నాం.

రాష్ట్రంలో 57 వేలకుపైగా ఉద్యోగాలు ఇవ్వడంలో ఎక్కడా చిన్న పొరపాటు జరక్కుండా పారదర్శకంగా భర్తీ చేశాం. 22 వేల మంది టీచర్ల ప్రమోషన్లు, 30 వేల టీచర్ల బదిలీల్లో ఎక్కడా చిన్న ఆరోపణ రాకుండా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి జరగని బదిలీల ప్రక్రియను పూర్తి చేశాం.రాష్ట్రంలో సమస్యలను ఒకటొకటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నాం. గతంలో నచ్చితే నజరానా నచ్చకపోతే జురిమానా విధానం ఉండేది. కానీ ప్రజా ప్రభుత్వం అలాంటి విధానానికి స్వస్తి పలికి స్పష్టమైన, విధానపరమైన నిర్ణయాలతో పరిపాలనను ప్రక్షాళన చేస్తూ ఒక పారదర్శకమైన పరిపాలన అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

## రాబోయే వేసవి కాలం దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు సిద్ధం చేసుకోవాలి



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి** వేసవి కాలం నేర్పద్యంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నష్టాలు నియంత్రణకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. డిజాస్టర్ మేనేజ్ మెంట్, వేసవిలో హీట్ వేవ్ పై సమ్మర్ యాక్షన్ ప్లాన్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి వడగాల్పులు నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పించాలని అన్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని రోజురోజుకి భానుడి ప్రతాపం పెరుగుతున్న సందర్భంగా మానవ, జంతవుల జీవితాల పై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు సరిగ్గా పని చేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలని అన్నారు. వేసవి కాలం ఈ నాలుగు నెలలు అప్రమత్తంగా ఉంటూ ఆశా కార్యకర్తల నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరి దగ్గర అవసరమైన మేర ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, ఆవసరమైన మందులు అందుబాటులో ఉండాలని ఆన్నారు. మధ్యహ్నం 12.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ప్రజలు ఎవరూ కూడ బయటకు రావద్దని, అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని సూచించారు. బయటకు వెళితే గొడుగు, తల పై టోపీ పెట్టుకోవాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మున్సిపల్, పంచాయితి శాఖ ల ద్వారా ప్రతి కూడళ్లలో త్రాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆన్నారు. వడ గాల్పుల వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమ్మర్ హీట్ వేవ్ నిర్వహణ కోసం జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్త వహించాలని, ఉపాధి హామీ పనులకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాల్పులు, ఎండతీవ్రత, తీసుకోవలసిన జాగ్రత్తలు పై విస్తృత ప్రచారం చేయాలని ఆన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డిఓ వినోద్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, డి.ఎం.హెచ్.ఓ. నరేందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శత వసంతాల మాలపల్లి నవల

గాంధేయ వాదిగా, న్యాయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కుల వ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, "మాలపల్లి" అనే విప్లవాత్మకమైన నవలను రవించడం, తన దృక్పథానికి మద్దతుగా, "సహ పంక్తి భోజనాలు" నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఒక దళిత కుటుంబం సమా జంలో కలిసి మెలసి ఉండడానికి చేసే ప్రయత్నం, సదరు ప్రయత్నంలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సంఘటి తమై సమాజంలో నిర్లక్ష్యం చేయబడ్డ తమ ఉనికి కోసం, మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాలు వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలు ఉదాత్తంగా చిత్రీకరించ బడ్డాయి. సామాజిక మార్పు కోసం బలహీన దళిత, పీడిత వర్గాలు చైతన్యంతో సుసంఘ టితం కావాలని, పోరాటా లకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. 1922లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయ వెల్లూరు జైలుకు ఉన్నవ లక్ష్మీనారాయణ తరలించ బడిన సమయం లోనే అక్కడే తన లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయమైన 'మాలపల్లి' నవలను ఆయన రచించారు. మాలపల్లి నవల దళిత కుటుంబాన్ని ప్రధాన కథాశంగా రచించిన తొలి రాజకీయ నవల. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావర ణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాల పల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్య గ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలాచారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమ గీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వర రావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామా న్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమ కూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది.ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. ఉన్నవ... మాల పల్లి, నాయకురాలు, బుడ బుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధు నిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూ రు పాడు గ్రామంలో 1877 డిసెంబరు 4న జన్మించి, 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

## త్రివిధ దళాలకు ఆయుధ బలాన్ని చేకూర్చే దళం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు

దేశ రక్షణలో అహరహం తలమునకలైన త్రివిధ దళాలు భారతీయ ఆర్మీ, ఏయిర్ ఫోర్స్, నావికా బలగాలకు ఆయుధ శక్తిని నింపుతున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు గత రెండు శతాబ్దాలకు పైగా అవిశ్రాంత అమూల్య సేవలను అందిస్తున్నాయి. మన దేశ త్రివిధ దళాలకు అవసరమయ్యే ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, రక్షణకు వినియోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసే ప్రభుత్వ రక్షణ రంగ సంస్థగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు అమూల్య సేవలను అందిస్తున్నాయి. భారత దేశ త్రివిధ సాయుధ దళాల వెనుక ఆయుధ శక్తిగా తన విశిష్టతలను ప్రదర్శిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల చరిత్ర చాలా గొప్పది. వలసపాలకుల కాలంలో 18 మార్చి 1801న తొలి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కలకత్తా సమీపాన కొస్సిపోర్ ప్రాంతంలో నెలకొల్పడం జరగడంతో ఆ చారిత్రాత్మక సన్నివేశానికి గుర్తుగా ప్రతి ఏట 18 మార్చిన దేశ త్రివిధ దళాలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డులు సంయుక్తంగా "ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవం"ను ఘనంగా జరుపుకోవడం కొనసాగుతున్నది. మన త్రివిధ దళాలకు ధీటుగా 4వ సాయుధ బలగంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు విశిష్ట సేవలను అందిస్తున్నాయి. కాలానుగుణంగా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని జీర్ణించుకుంటూ వివిధ రకాలైన ఆయుధాలు, మందు గుండు సామాగ్రి, రక్షణ రంగ వాహనాల రూపకల్పన, సిబ్బంది ప్రత్యేక దుస్తుల తయారీ, పర్వత ప్రాంత రవాణాకు సంబంధించిన ఉపకరణాలు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలను మన దేశ అవసరాలకు అనుగుణంగా తయారు చేసి సమయానికి అందిస్తూ దేశ రక్షణలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సిబ్బంది సేవలను గుర్తించడం, దేశ రక్షణలో అమరత్వం పొందిన యోధులను స్మరించుకోవడం, అత్యాధునిక ఆయుధాల ప్రదర్శన, ఆధునిక పరిశోధనా ఫలితాల మూట విప్పడం, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సేవకు సంబంధించిన ఫోటో ప్రదర్శనలు, పరెడ్ల నిర్వహణ లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. దేశవ్యాప్తంగా 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు 24 ప్రాంతాల్లో స్థాపించడంతో పాటు 9 శిక్షణ కేంద్రాలు, 3 ప్రాంతీయ మార్కెటింగ్ కేంద్రాలు, 4 ప్రాంతీయ భద్రత కార్యాలయాలు 5 ఆపరేషనల్ విభాగాలుగా విస్తరించి ఉన్నాయి. అత్యధికంగా మహారాష్ట్రలో 10, యూపీలో 09, ఎంపీ/తమిళనాడుల్లో 06 చొప్పున ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు స్థాపించడం జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం నుంచి నేటి వరకు తన ప్రత్యేకతను నిలుపుకుంటూ వస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు రానున్న కాలంలో కూడా త్రివిధ దళాలకు ఆయుధ శక్తిని అందిస్తూ దేశ సమగ్రత, సమైతలను కాపాడటంలో తనదైన పాత్రను పోషిస్తున్నది. భారత మాత సేవలో ప్రాణాలర్పించిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు సంబంధించిన అమరులకు ఘన నివాళులు అర్పించడం, ప్రస్తుతం సేవలు అందిస్తున్న సైనికులకు ధైర్యంగా నిలవడం మన కనీస భాధ్యత.

## వైసీపీ ద్వారాలు తెరిచే ఉన్నాయ్...

విజయవాడ, మార్చి 17, వైసీపీ అధినేత జగన్ పార్టీ కార్యాలయం గేట్లు ఓపెన్ చేస్తున్నారు. గతంలో పార్టీని వీడిన నేతలను ఒక్కొక్కరుగా చేరిపోయేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీని వీడి వెళ్లిన వారిని తిరిగి చేర్చుకునేందుకు కూడా జగన్ సిద్ధమయినట్లు తెలిసింది. ఈ మేరకు సంకేతాలను పంపారు. గత ఎన్నికలకు ముందు, తర్వాత వివిధ కారణాలతో పార్టీని వీడి అనేక మంది సీనియర్ నేతలు పార్టీని వీడి వెళ్లారు. సామాజికవర్గంగానే మాత్రమే కాకుండా ఆర్థికంగా బలమైన నేతలు కూడా పార్టీని వీడివెళ్లారు. అయితే ఇతర పార్టీలకు వెళ్లిన నేతలు అక్కడ ఆనందంగా లేరు. అక్కడ వారికి ప్రాధాన్యత దక్కడం లేదు. మరొక వైపు వైసీపీకి అంతో ఇంతో మళ్లీ గ్రాఫ్ పెరుగుతుందని భావించి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నారని ప్రచారం జరగుతుంది.. గత ఎన్నికల సందర్భంగా సీట్లు దక్కని వాళ్లు, జగన్ పోకడలను నచ్చని వాళ్లు పార్టీని వదిలి వెళ్లిపోయారు. కూటమి ఏర్పాటుతో తమ ఓటమి ఖాయమయిందని నమ్మిన నేతలు భవిష్యత్ లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని భావించి తమ దారి తాము వెతుక్కున్నారు. జగన్ కూడా వెళ్లిపోయిన నేతలను ఎవరినీ ఆపలేదు. అలాగని రమ్మని పిలవడం లేదు. వారంతట వారు వస్తే మాత్రం తిరిగి పార్టీలో చేర్చుకుంటామని మాత్రం జగన్ సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. నిన్న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎవరైనా వస్తానంటే తాను కాదంటానా? అని నవ్వుతూ ఆయన అనడంతో పార్టీని వీడిన నేతలను తిరిగి చేర్చుకుంటారన్న నమ్మకం నేతల్లో పెరిగింది.. ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీని వీడి వెళ్లి వచ్చినా ఆయనను కూడా తిరిగి పార్టీలో చేర్చుకోవడాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. తాజాగా ఇప్పటికే రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని పార్టీలోకి చేర్చుకునేందుకు జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు. గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో కాపు రామచంద్రారెడ్డి వైసీపీని వీడి కాంగ్రెస్ లో చేరిపోయారు. తిరిగి ఆయన వస్తానని కబురు పంపడంతో జగన్ అందుకు అంగీకరించారంటున్నారు. ఒక ఫైన్ మార్నింగ్ కాపుకు వైసీపీ కండువా కప్పేందుకు సిద్ధమవుతున్నారు. కాపు రామచంద్రారెడ్డితో పాటు మరికొందరు నేతలు కూడా రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది తూ.గో నేత ఒకరిని... అంటే కూటమి పార్టీకి చెందిన నేతలు ఎవరూ రారు. ఒకవేళ వచ్చినా ఎన్నికలకు ముందు మాత్రమే వస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో అసంతృప్తిగా ఉన్న ఒక నేతను పార్టీలో చేర్చుకోవడానికి కూడా జగన్ దూతలను పంపినట్లు తెలిసింది.

గత ఎన్నికలలో ఆయనకు టిక్కెట్ రాకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తగిన ప్రాధాన్యత దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారని గ్రహించి దూతలను పంపారని సమాచారం. దీంతో పాటు ఇతర పార్టీల నేతలను కూడా పార్టీలోకి తీసుకుంటారని చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి కూడా అనేక మంది నేతలు వచ్చేందుకు సిద్ధమవుతున్నారని చెబుతున్నారు. మొత్తం మీద ఫ్యాన్ పార్టీకి త్వరలో చేరికలు ఉంటాయన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

### పది సూత్రాలతోనే పోస్టులు...

తిరుపతి, మార్చి 17, తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ పోస్టు భర్తీ విషయంలో కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తుండటంతో దిగువ స్థాయి నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాము పడిన కష్టానికి ఈసారైనా ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. ఇటు కూటమిలోని అన్ని పార్టీలూ నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేల నుంచి ముఖ్య నేతలు, కార్యకర్తల పేర్లను పంపాలని చంద్రబాబు నాయుడు సూచించడంతో వారు ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి పేర్లు అయితే వచ్చాయి. పోటీ మాత్రం తీవ్రంగా ఉంది. ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై ఇంకా కసరత్తు కొనసాగుతుంది. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో చంద్రబాబు అనేక సూత్రాలను పాటిస్తున్నారు. ప్రాంతాలు, కులాలు, పార్టీల వారీగా పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమైన, ప్రాధాన్యత కలిగిన పోస్టులకు గత ఎన్నికల్లో సీట్లు దక్కని వారి పేర్లను కూడా పరిశీలిస్తున్నారు. వారిని కొంత కాలం నామినేటెడ్ పదవుల్లో ఉంచితే కొంతలో కొంత ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ తగ్గుతుందని భావిస్తున్నారు. అందుకే మాజీ ఎమ్మెల్యేలను, గత ఎన్నికల్లో టిక్కెట్ రాని వారికి ముఖ్యమైన పోస్టుల్లో నియమించాలన్న ప్రతిపాదన ఒకటి ఆయన సీరియస్ గానే పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కొన్ని ముఖ్యమైన నేతలకు ఇప్పటికే ఫోన్లు చేసి సమాచారం అందించి వారి అభిప్రాయాలను కూడా తీసుకున్నట్లు చెబుతున్నారు. రెండు హామీల విధివిధానాలపై చర్చ ప్రధాన దేవాలయాల్లో... ముఖ్యంగా ప్రధాన దేవాలయాల్లో బాగా కష్టపడి పనిచేసిన నేతలకు, కార్యకర్తలకు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పాలకమండలిని భర్తీ చేసే ఉద్దేశ్యంతో ఉన్న ఆయన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ముఖ్యమైన నేతలకు ఇవ్వాలని భావిస్తున్నారు. పోస్టులు తక్కువ, పేర్లు ఎక్కువగా ఉండటంతో మొదటి రెండు జాబితాల్లో రాని వారికి మలి జాబితాలో చోటు కల్పించాలని చూస్తున్నారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో పాటు తాను సొంతంగా నియోజకవర్గాల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆయన పేర్లను ఖరారు చేస్తుండటంతో పాటు లోకేశ్ సూచించిన వారికి కూడా కొంత ప్రాధాన్యత దక్కే అవకాశాలున్నాయి. దీంతో తమ్ముళ్లలో టెన్షన్ నెలకొంది. తమకు ఈసారైనా పదవులు వస్తాయా? రావా? అన్న దానిపై ఆందోళనలో ఉన్నారు.

## యనమల రామకృష్ణుడి శకం ముగిసినట్టేనా



కాకినాడ, మార్చి 17, తెలుగుదేశం పార్టీలో అత్యంత సీనియర్ నాయకుల్లో ఒకరు యనమల రామకృష్ణుడు.. తెలుగుదేశం ఆవిర్భావం నాటి నుంచి చట్టసభల్లో ఏదో ఒక పదవిలో కొనసాగుతూ వచ్చిన యనమలకు ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవీకాలం ముగియడంతో ఏ పోస్టు లేకుండా పోయింది.. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఆయనకు ఈ సారి ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ చేయలేదు.. దాంతో రాజకీయాల్లో యనమల రామకృష్ణుడి శకం ముగిసిందా అన్న చర్చ మొదలైంది. నాలుగు దశాబ్దాలకు పైబడిన రాజకీయ జీవితంలో తొలిసారి చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండాపోయిన యనమల పొలిటికల్ ఫ్యూచర్‌పై పెద్ద చర్చే జరుగుతోందిప్పుడు.టీడీపీలో అత్యంత సీనియర్ నేతలుగా కొనసాగుతున్న నేతల్లో యనమల రామకృష్ణుడు ఒకరు. అశోక్ గజపతి రాజు, యనమల రామకృష్ణుడు, షరీఫ్ వంటి సీనియర్లు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. యనమల రామ్మకృష్ణుడు తొలిసారి 1983లో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఏదో ఒక చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉన్నారు. మంత్రిగా, స్పీకర్‌గా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గా అనేక కీలకపదవులు నిర్వహించారు. 73 ఏళ్ల వయస్సులోనూ రాజకీయాల్లో యాక్టివ్ గానే ఉంటున్నారు.అయితే పార్టీలో యువతను ప్రోత్సహించాలనే కొత్త ఫార్ములాను టిడిపి ఈమధ్య ఆచరణ లో పెడుతోంది. దాని కారణంగా యనమల లాంటి సీనియర్లను పక్కన పెడుతున్నారు అనే ప్రచారం పార్టీలోనే సాగుతోంది. యనమల కుమార్తె దివ్య ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా తుని శాసనసభ్యురాలి గా ఉన్నారు. 1983 నుండి 2004 వరకూ 6 సార్లు ఎమ్మెల్యే గా యనమల రామకృష్ణుడు గెలిచిన నియోజకవర్గం అది. 2009 లో తొలిసారి ఓటమి చెందినా ఆయనకు కీలక పదవులు ఇచ్చి టీడీపీ గౌరవించింది.2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఎమ్మెల్సీగా ఉన్న యనమలకు చంద్రబాబు మంత్రిపదవి కట్టబెట్టారు. పార్టీ అధికారంలో లేనప్పుడు సైతం పీఏసీ చైర్మన్ వంటి పదవులు ఇచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడి పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. అయితే ఈసారి ఆయనకు ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇవ్వకపోవడంతో పొలిటికల్ గా యనమల కెరీర్ కు చెక్ పడినట్టే అని ప్రచారం మొదలైంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో యనమలకు మరోసారి అవకాశం దక్కుతుందని భావించారు.టీడీపీకి దక్కిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు బీసీలకు కేటాయించినా యనమలకు మాత్రం ఛాన్స్ దక్కలేదు. బీటీ నాయుడు, బీద రవిచంద్రలను బీసీ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపిక చేశారు. యనమల తుని నుంచి 2009 ఎన్నికల్లో తొలి సారి పరాజయం పాలయ్యారు. అప్పుడు కూడా చంద్రబాబు 2013లో ఆయన్ని ఎమ్మెల్సీని చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు యనమల శాసనమండలి సభ్యుడిగా కొనసాగుతూ వచ్చారు. అదీకాక యనమల బంధుగణానికి కూడా చంద్రబాబు పార్టీలో మంచి ప్రాధాన్యతే ఇచ్చారు. యనమల సన్నిహిత బంధువు , టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రస్తుతం మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. పుట్టా మహేష్‌కుమార్ ఏలూరు ఎంపీగా గెలిచారు. యనమల కూతురు తుని ఎమ్మెల్యేగా విజయం సాధించారుఅయినా తనకు టికెట్ దక్కకపోవడంపై యనమల ఎలా రియాక్ట్ అవుతారా అన్న అంశంపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వాస్తవానికి చంద్రబాబు తన కేబినెట్ లో యనమలకు అవకాశం ఇవ్వకపోవడంతో.. ఇప్పటికే యనమల ఒకింత అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి కొలువుదీరిన తరువాత కాకినాడ పోర్టు విషయంలో తెలుగుదేశం తీసుకున్న నిర్ణయాన్ని, అనుసరించిన విధానాన్ని వ్యతిరేకిస్తూ యనమల కొన్ని వ్యాఖ్యలు చేయడంతో ఆయన పార్టీకి దూరం జరుగుతున్నారా అన్న అనుమానాలు కూడా అప్పట్లో వ్యక్తం అయ్యాయిపొలిటికల్ గా ఎప్పుడు గుంభనంగా ఉండే యనమల రామకృష్ణుడు కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక సమయంలో ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేశారు. బీసీ కోటాలో ఆయన ఆ పదవి ఆశించారు. దక్కకపోయేసరికి కొంత అసంతృప్తికి లోనై అధ్యక్షుడికి లేఖ రాశారు.ఇక ఇప్పుడు తాజాగా ఆయనకు ఎమ్మెల్సీగా మరో అవకాశం ఇవ్వకపోవడంతో యనమల ఎలా రియాక్ట్ అవుతారన్న ఆసక్తి నెలకొంది. మరోవైపు యనమల పార్టీకి చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని హై కమాండ్ ఏదో ఒక కీలకపదవి ఇస్తుందని, లేదా 2027 లో ఖాళీ అయ్యే ఎమ్మెల్సి స్థానాల్లో అయినా ఆయనకు చోటు కల్పిస్తారని యనమల సన్నిహితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి చూడాలి యనమల పొలిటికల్ ఫ్యూచర్ ఎలా ఉండబోతుందో?

## వర్మ త్యాగంపై సోషల్ మీడియాలో ఫైట్

కాకినాడ, మార్చి 17 జనసేన ఆవిర్భావ దినోత్సవం నాడు పిఠాపురంలో జరిగిన సమావేశం తర్వాత రాష్ట్రంలో కూటమిలోని ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య గ్యాప్ పెరిగింది. పిఠాపురం వేదికగా చేసిన వ్యాఖ్యలు రెండుపార్టీల క్యాడర్ సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకునే పరిస్థితి ఏర్పడింది. పార్టీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య కెమెస్ట్రీ బాగానే ఉన్నప్పటికీ క్యాడర్ మాత్రం పూర్తిగా ఈ సభ తర్వాత విడిపోయినట్లే కనిపిస్తుందని సోషల్ మీడియాలో పోస్టింగ్ లు చూస్తుంటే అర్థమవుతుంది. ఇద్దరు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఎవరి వల్ల గెలుపు అనే అంశంపై తమకు తోచినట్లు పెడుతున్న కామెంట్స్ కాక రేపుతున్నాయ్. జయకేతనం సభలో పవన్ కల్యాణ్ తో పాటు నాగబాబు చేసిన వ్యాఖ్యలు ఉష్ణోగ్రతల కంటే గరిష్టంగా హీట్ ను రెండు పార్టీలలో పుట్టించిందనే చెప్పాలి. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న తెలుగుదేశాన్ని తానే నిలబెట్టానని పవన్ కళ్యాణ్ అన్న కామెంట్లు, వర్మను ఉద్దేశించి నాగబాబు పరోక్షంగానే చేసిన కామెంట్ల పైనే ఇప్పుడు సోషల్ మీడియాలో తమ్ముళ్లు బాధపడిపోతున్నారు. తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలభై ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీని ఒకరు నిలబెట్టేదేంటని ప్రశ్నిస్తున్నారు. తమకు 175 నియోజకవర్గాల్లో ఓటు బ్యాంకు, క్యాడర్ బలంగా ఉందని, జనసేన ఎన్ని నియోజకవర్గాల్లో బలంగా ఉందో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. ఈ విషయాలు తెలియకుండా మాట్లాడితే ఊరుకోబోమంటూ ఒకరకంగా వార్నింగ్ లు ఇచ్చినట్లే వారి కామెంట్స్ కనపడుతున్నాయి జనసేన క్యాడర్ కూడా ధీటుగానే సమాధానం ఇస్తుంది. నిజానికి జైల్లో ఉన్న చంద్రబాబును పవన్ కల్యాణ్ పరామర్శించడం దగ్గర నుంచి కూటమి ఏర్పాటు వరకూ ఆయన చేసిన కృషిని మరిచిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో ఉన్న టీడీపీని పవన్ కల్యాణ్ ఆదుకున్న విషయాన్ని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందేనని, ఆయన చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని నిలదీస్తున్నారు. తాము కష్టపడి పనిచేయడం, తక్కువ సీట్లకే పోటీ చేయడం, ఉభయ గోదావరి జిల్లాల్లో తమకు పట్టున్నా ఓటు చీలకుండా కూటమి గెలుపునకు కారణం ఎవరనివారు సోషల్ మీడియా వేదికగా అంటున్నారు. దీంతో .. కూటమి మధ్య అగాధం ఏర్పడుతుందనే ఆందోళన ఇరు పార్టీల నేతల్లో కనిపిస్తుంది. నాగబాబు విషయాన్ని పెద్దగా సీరియస్ గా తీసుకోకపోయినా.. వర్మ చేసిన త్యాగాన్ని ఆయన కించపర్చడం ఏంటని టీడీపీ క్యాడర్ గుర్రుగా ఉంది. గతంలో వర్మ స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఎవరికి ఎన్ని ఓట్ల శాతం వచ్చాయో తెలుసుకుంటే బాగుంటుందని కూడా సూచిస్తున్నారు. కూటమి అంటే కలసి పోటీ చేయడం, కలసి పనిచేయడమేనని, అంతే తప్ప ఏ ఒక్కరి వల్లో విజయం సాధ్యం కాదని, రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని భావించి జనం ఓట్లేశారని తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. ఇదే సమయంలో జనసేన ను కించపరిస్తే నష్టపోయేదే మీరేనంటూ జనసైనికులు కూడా హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద జయకేతనం సభ మాత్రం రెండు పార్టీల క్యాడర్ లో గ్యాప్ మాత్రం బాగానే కనిపిస్తుంది. ఇద్దరూ సంయమనం పాటిస్తేనే మంచిదని, లేకుంటే ఇరువురికి నష్టమన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.

# అమరావతికి రీ లాంఛ్ ....

విజయవాడ, మార్చి 17, ఏపీ కలల రాజధాని అమరావతి స్వయం సమృద్ధి ప్రాజెక్టుగా ఘనంగా రీలాంఛ్ కాబోతోంది. ఒక్కసారి పనులు మొదలు పెట్టి మూడేళ్లలో పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం పట్టుదలగా ఉంది.ప్రధాని చేతుల మీదుగా రీలాంఛ్ కు రెడీ అవుతోంది. అవును ఆంధ్రుల కలల రాజధానికి కొత్త రెక్కలు వచ్చేశాయ్.

ఇప్పుడు ఎలాంటి ఆటంకాలు లేవ్. అడ్డంకులు అసలే లేవు. గ్రహణాలన్నీ వీడిపోయాయ్. రోడ్ మ్యాప్ క్లియర్ గా ఉంది. టార్గెట్ కనిపిస్తూనే ఉంది. అందాల్సిన నిధులు వస్తూనే ఉన్నాయి. చేయాల్సిన పనులు ఖరారయ్యాయ్. కలల్ని సాకారం చేస్తూ అద్భుతమైన, అందమైన రాజధాని అమరావతి సాక్షాత్కారం చేసుకునేందుకు రీస్టార్ట్ అవుతోందిఅమరావతికి ఇప్పుడు అన్నీ మంచి శకునాలే కనిపిస్తున్నాయి. 2028 నాటికి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. అన్ని పనులను మరికొద్ది రోజుల్లోనే ఒకేసారి మొదలు పెట్టి రాజధాని నిర్మాణ పనుల్ని రీలాంఛ్ చేయబోతోంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పనుల్ని అట్టహాసంగా మొదలు పెట్టబోతోంది చంద్రబాబు ప్రభుత్వం. ఆంధ్రుల ఆశల్ని సజీవంగా ఉంచుతూ సరికొత్త రాజధానిని ఆవిష్కరించేందుకు పెద్ద ముందడుగు పడబోతోంది. ఇక ఒక్కసారి పని మొదలైందంటే ఆగేదే లేదు. ఎక్కడా తగ్గేదే లేదు. 2028 దాకా నాన్ స్టాప్, అన్ స్టాపబుల్ అంతే.నిజానికి అమరావతి కాల పరీక్షకు తట్టుకుని నిలబడింది. గతంలో చేపట్టిన నిర్మాణాలు స్ట్రాంగ్ గానే ఉన్నాయని టెక్నికల్ కమిటీలు తేల్చాయి. అందుకే వాటి పనుల్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడమే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముందుంది. అటు చంద్రబాబు సర్కార్ కూడా ఈసారి గట్టి సంకల్పమే తీసుకుంది. అటు చూస్తే కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా పూర్తిగా ఉండడంతో కచ్చితంగా రాజధానిని నిర్మించి నిలబెట్టి జనం ముందు ఉంచేలా మాస్టర్ ప్లాన్ రెడీ చేసింది. అమరావతి అంటే తిరుగులేనిది. ఈ పేరుకు ఓ బ్రాండ్ ఉంది. స్టామినా ఉంది. అంతకు మించి హిస్టరీ ఉంది. ఎవరు వచ్చినా.. ఇంకెవరు పాలించినా.. రాజధానిగా అమరావతి చెరిగిపోని ముద్ర వేయబోతోంది. చరిత్ర సృష్టించబోతోంది. ఎన్ని కాలాలైనా సగర్వంగా చెప్పుకునేలా ఉండబోతోంది.రాజధాని ఈ ప్రాంతంలోనే ఏర్పాటవుతుందని చెప్పడమే తరువాయి. 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల త్యాగం వృధాగా పోలేదు. వారి పోరాటాలు వృధా అవలేదు. రాజధాని నిర్మాణం కోసం 64 వేల కోట్లు అవసరమవుతున్నాయ్. ఈ నిధులతో ఒక అడగు ముందుకు పడితే మిగితా పనులన్నీ వెంట వెంటనే జరగడం ఖాయమే. ఇది సస్టైనబుల్ ప్రాజెక్ట్. రాజధాని అన్నది అవకాశాలను సృష్టిస్తుంది. ఉపాధిని పెంచుతుంది. సౌకర్యాలు తీసుకొస్తుంది. సంపదను సృష్టిస్తుంది.

అంటే పెట్టిన ఖర్చు తీరడమే కాదు.. అంతకు మించి ఎవరూ ఊహించని ప్రయోజనాలను రాజధాని అందించబోతోంది.పీపుల్స్ క్యాపిటల్ అని రాజధాని అమరావతికి క్యాప్షన్ ఇచ్చారు. అంటే అందరినీ అక్కున చేర్చుకునేలా ఉపాధి అవకాశాలు పెంచేలా, ప్రపంచంలోనే టాప్-5 నగరాల్లో ఒకటిగా ఉండేలా డిజైన్ చేశారు. మోస్ట్ అడ్వాన్స్ డ్ టెక్నాలజీతో పాటు మెరుగైన మౌలిక వసతులు రాబోతున్నాయి. నెక్ట్ జెనరేషన్ క్యాపిటల్ సిటీ ఎలా ఉంటుందో అమరావతి పూర్తయ్యాక చూస్తే తెలుస్తుంది. నిజానికి రాజధాని నిర్మాణం ఎవరికీ రాని, చాలా అరుదైన అవకాశం. దీన్ని సీఎం చంద్రబాబు సంపూర్ణంగా పూర్తి చేసేలా బాధ్యత భుజానికెత్తుకున్నారు. కలల రాజధానిని సాకారం చేసి చూపిస్తామన్నారు.అమరావతిలో 40 వేల కోట్ల రూపాయల విలువైన నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజధానిలో నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీలకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ పూర్తికాగానే రాజధానిలో పనులు ప్రారంభం అయ్యే ఛాన్స్ ఉంది. 73 పనులకు సీఆర్‌డీఏ నుంచి అనుమతి వచ్చింది. 63 పనులకు టెండర్లు పూర్తి చేశారు. వాటి విలువ 39,678 కోట్లుగా ఉంది. అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం మొత్తంగా 64 వేల 721 కోట్లు అవసరం కానున్నాయి. వివిధ రకాల ఆదాయ మార్గాల ద్వారా అమరావతి పనులు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రెడీ చేసి పెట్టుకుంది.అమరావతికి వరల్డ్ బ్యాంకు, ఏడీబీ బ్యాంకు కలిపి 13 వేల 400 కోట్ల రూపాయల రుణం ఇస్తుండగా, ఐఈచి బ్యాంక్ 5 వేల కోట్ల రూపాయల రుణం ఇస్తోంది. అటు హడ్కో 11 వేల కోట్లు అప్పుగా ఇవ్వబోతోంది. అయితే ఈ అప్పులను ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి తీసుకురాబోమని కేంద్రం తాజాగా పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. ఈ రుణాలను ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిమితిలో లెక్కించకూడదని నిర్ణయించినట్లు పార్లమెంట్‌కు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు.

2014-19లో 131 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రతిష్ఠాత్మక సంస్థలకు 1,277 ఎకరాలు ఇచ్చారు. అయితే గత ఐదేళ్లు రాజధాని నిర్మాణం జరగకపోవడంతో ఆ సంస్థల్లో కొన్ని వెనక్కు వెళ్లాయి. భవనాలు నిర్మించుకునేందుకు ఇంట్రెస్ట్ చూపలేకపోయాయి. ఇందులో ఆర్బీఐ, బిట్స్ పిలానీ సహా కీలక సంస్థలెన్నో ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ కదలిక వస్తోంది.

తాజాగా 31 సంస్థలకు 629 ఎకరాలు భూమి ఇచ్చారు. గత ప్రభుత్వం ఆర్-5 జోన్‌లో 50 వేల మందికి ఒక సెంటు భూమి అమరావతిలో ఇచ్చింది. అయితే వారికి వేరేచోట భూమి కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం అంటోంది.కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లో సమస్యలు పరిష్కరించి టెండర్లు ఆహ్వానించిన పరిస్థితి ఉంది. దీన్ని ప్రయారిటీగా తీసుకోవడంతోనే ఇదంతా జరుగుతోంది. ఈనెల 17న జరిగే కేబినెట్‌లో వీటన్నింటికీ ఆమోదం పొంది వెంటనే పనులు ప్రారంభించబోతున్నారు. ఏప్రిల్ నెల నుంచి అమరావతి అభివృద్ధి పనుల్లో 20 వేల మంది పాల్గొనబోతున్నారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బిడ్జ్ సహా ఇంకెన్నో రాబోతున్నాయి. ఈ పనులన్నిటికీ ప్రధాని మోడీ రీలాంఛ్ చేయడం ద్వారా నాన్ స్టాప్ గా జరగబోతున్నాయి. అటు రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడేళ్లలో రైతులకు అప్పగిస్తారు.

# పోలీసులు జగన్ కు కొమ్ముకాస్తున్నారు

## దస్తగిరి భార్య ఆవేదన

కడప, మార్చి 17, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులు రెండు రాష్ట్రాల్లో ఎంతటి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. హత్యకేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరి భార్య షాబానా మీద దాడి జరిగింది. ఇద్దరు వైసీపీ మహిళా కార్యకర్తలు తన మీద దాడికి పాల్పడ్డారని దస్తగిరి భార్య వెల్లడించింది. పులివెందుల నియోజక వర్గంలోని తొండూరు మండలం మల్యాల గ్రామంలో తన మీద దాడి చేశారని తెలిపింది.మల్యాల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లిన షాబానా మీద ఇద్దరు మహిళా కార్యకర్తలు ఇంట్లోకి చొరబడి ఉద్దేశ పూర్వకంగానే తనను బూతులు తిడుతూ దాడి చేశారని షాబానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. ప్రశాంతంగా కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. కొందరు మహళలు తన ఇంట్లోకి చొరబడి.. ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని షాబానా తెలిపారు. వాళ్లు అంతటితో ఆగకుండా ఏడాదిలోపు నీ భర్త దస్తగిరిని నరికేస్తామని ఇద్దరు వైసీపీ కార్యకర్తలు హెచ్చరించారని షాబానా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జగన్, అవినాష్ రెడ్డికి వ్యతిరేకంగా నీ భర్త మాట్లాడేంత ధైర్యం ఎక్కడికి వచ్చిందంటూ విచక్షణా రహితంగా కొట్టారని ఆమె తెలిపారు. అదే సమయంలో మరో ఇంట్లో ఉన్న దస్తగిరి సమాచారం అందుకుని వెంటనే ఘటనా స్థలానికి గన్ మెన్లతో వచ్చినప్పటికీ ఇద్దరు మహిళలు ఏ మాత్రం తగ్గకుండా దంపతుల ఇద్దరిపై ఇష్టానుసారంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తొండూరు పులివెందుల రూరల్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ వాళ్లు ఇంతవరకు కేసు నమోదు చేయలేదని షాబానా వాపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.." జగన్మోహన్ రెడ్డి, అవినాష్ రెడ్డికి వ్యతిరేకంగా దస్తగిరి మాట్లాడుతారా ? అంటూ విచక్షణారహితంగా కొట్టారు. మల్యాల గ్రామానికి చెందిన శంషున్, పర్వీన్ లను ఎవరు పంపితే నా మీద దాడి చేశారో పోలీసులు తేల్చాలి. వివేకా వాచ్‌మెన్ రంగన్న చనిపోయిన తర్వాత నా భర్తను చంపాలని చూస్తున్నారు. సంవత్సరంలో చంపేస్తాము. ముక్కలు ముక్కలుగా నరికేస్తామన్నారు. జగన్, అవినాష్ రెడ్డిల మీద తప్పుడు సాక్ష్యం చెప్పి జైలుకు పోయి వచ్చిన తర్వాత హారతులు ఇస్తావా.. అంటూ నన్ను విచక్షణారహితంగా బూతులు మాట్లాడుతూ కొట్టారు. దస్తగిరిని చంపిన నాలుగేళ్ల తర్వాత నన్ను చంపుతామన్నారు. ఇద్దరు మహిళలు పదే పదే అవినాష్ రెడ్డి పేరు ప్రస్తావించారు. ఘటన జరిగి 3 రోజులైనా ఇప్పటి వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు" అని షబానా ఆవేదన చెందారు.

# ముదురుతున్న భాషా విధానం

దేశంలో భాషా వివాదం రాజకీయ రంగు పులుముకుంది. తమిళనాడులో ఎలాగైనా హిందీ అమలు జరగాల్సిందేనని కేంద్రం భావిస్తోంది. అయితే అందుకు అవకాశం లేదని, హిందీ భాషను అమలు చేసేదేలేదంటూ తమిళనాడు డీఎంకే సర్కార్ కరాకండిగా చెబుతోంది. దీంతో ఎటూ తేల్చుకోలేని అన్నాడీఎంకే సైతం కేంద్రం పెత్తనం ఏమిటనే వాయిస్ వినిపిస్తోంది. అయితే త్రి భాషా వివాదం రగులుతున్న సమయంలో అనూహ్యంగా గుగూల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ను ఇందులోకి లాగారు. భాషల రాజకీయ యుద్ధంలోకి పిచాయ్‌ను ఎందుకు తీసుకొచ్చారనేది ఇప్పుడు హాట్ టాఫిక్ గా మారింది.నియోజక వర్గాల పుర్విభజనతో పాటుగా త్రిభాషా విధానంపై తమిళనాడులో గత కొద్ది రోజులుగా వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ త్రిభాషా విధానంపై చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లయింది. పిఠాపురంలో శుక్రవారం జరిగిన పార్టీ ఆవిర్భావసభలో పవ న్ కల్యాణ్ మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం హిందీని కేంద్రం రాష్ట్రం పై బలవంతంగా రుద్దుతోందంటూ వ్యతిరేకించడాన్ని తప్పుబట్టారు. దక్షిణాదిపై కేంద్రం హిందీని బలవంతంగారుద్దుతున్నారని మాట్లాడుతున్నప్పుడు తమిళ సినిమాలను హిందీలోకి డబ్బింగ్ ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై డీఎంకే కూడా ఘాటుగా స్పందించింది.భాషా విధానంపై తమిళనాడు వైఖరిని పవన్ తప్పుగా అర్థం చేసుకున్నారని పార్టీ అధికార ప్రతినిధి సయీద్ హఫీజుల్లా అన్నారు. వ్యక్తిగతంగా హిందీ, ఇతర భాషలను నేర్చుకోవడాన్ని తాము ఎన్నడూ అడ్డుకోలేదన్నారు. ఆసక్తి ఉన్న వాళ్లు నేర్చుకోవడం కోసం ఇప్పటికే తమ రాష్ట్రంలో హిం దీ ప్రచార సభలను నిర్వహిస్తున్నామన్న ఆయన అయితే కేంద్రప్రభుత్వం మాత్రం ఎన్ఈపీ, పీఎం శ్రీస్కూల్స్ వంటి విధానాలతో రాష్ట్ర ప్రజలపై హిందీ భాషను రుద్దడాన్నే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.కాగా 1938 నుంచే తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ద్విభాషా విధానాన్నే అమలు చేస్తామని ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని కూడా అమలు చేసుకున్నామని మరో సీనియర్ నేత ఎళంగోవన్ అన్నారు.1968లో బిల్లు ఆమోదం పొందినప్పుడు పవన్ కల్యాణ్ ఇంకా పుట్టి ఉండరని, తమిళ రాజకీయాలపై ఆయనకు అవగాహన లేకపోయి ఒడొచ్చంటూ కాస్త ఘాటుగా స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను సమర్థించే వారు, వ్యతిరేకించేవారు చేసే ప్రకటనలతో ఈ వివాదం మరిం త ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.అయితే స్టాలిన్ ప్రభుత్వం ఈ వివాదాన్ని మరింత రాజేసేలాగే కనిపిస్తోంది. బడ్జెట్ ప్రసంగం పాఠంపై రూపీ స్థానంలో తమిళ గుర్తును ఉం చడం తాజా మలుపు. ఈ చర్య ద్వారా స్టాలిన్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ నేతలను మరింత రెచ్చగొట్టినట్లయింది. మరోవైపు నియోజక వర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు జరగబోయే అన్యాయం పై ఈ నెల 22న ఏర్పాటు చేసిన సదస్సుకు దక్షిణాదిలోని దాదాపు అన్ని పార్టీలు మద్దతు పలుకుతున్నాయి. ఇప్పటికే తెంగాణ ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి పూర్తి మద్దతు ప్రకటించగా, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా మద్దతు తెలిపింది.తాజాగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఈ సమావేశానికి మద్దతు తెలిపారు. మరోవైపు ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామి అయిన డీఎంకే ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి తాము తప్పక హాజరవుతామని కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ప్రకటించారు. అన్నిటికి మించి ఒడిశాలో దాదాపు పాతికేళ్ల పాటు అధికారంలో కొనసాగిన, ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న బిజూ జనతాదళ్ కూడా ఈ సమావేశానికి హాజరవుతుండడం విశేషం. ఈ సమావేశం ద్వారా స్టాలిన్ మరోసారి ప్రతిపక్షాలను ఒక్కతాటిపైకి తేవడంతో పాటు హిందీ వ్యతిరేక ఆందోళనలతో కలిపి వచ్చే ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకొంటున్నారు.దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క ఏపీ సీఎం, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం దీనిపై తన వైఖరిని స్పష్ట చేయకపోవడం గమనార్హం. ఎన్డీఏ కూటమి భాగస్వామిగా ఉండడమే అందుకు కారణంగా భావించవచ్చు. ఇంత గొడవ జరుగుతున్నా కేంద్రంలోని బీజేపీ నేతలు సన్నాయి నొక్కులతో సరిపెడుతున్నారే తప్ప ఈ రెండు ప్రధాన అంశాలపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వెనుక బీజేపీపెద్దలకు అన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల మాదిరిగా తమిళనాడులో కూడా ఏదైనా రహస్య అజెండా ఉందేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేంద్రంపై పోరాటానికి తమిళ పార్టీలు ఎల్లప్పుడు ముందే ఉంటాయి. ముఖ్యంగా భాష విషయంలో అసలే వెనకడుగు వేయకపోగా.. హిందీ భాషను 1968 తమిళనాడులో ప్రవేశ పెట్టాలనుకుంటే అప్పుడు ఓ యుద్ధమే జరిగింది. తాజాగా కేంద్రం త్రి భాషా విధానాన్ని వ్యతిరేస్తూ తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా సమానికి సై అంటున్నారు. కానీ తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై మాత్రం.. హిందీ ఎందుకు కావాలో తెలుపుతూ సుందర్ పిచాయ్‌కి చెందిన ఓ వీడియోను నెట్టింట పోస్ట్ చేశారు. పాఠశాలలో తాను హిందీని ఎలా నేర్చుకున్నానో అందులో ఆయన చెప్పుకొచ్చారు. తన ఎదుగుదలకు హిందీ కూడా ఓ కారణమని ఆ వీడియోలో చెప్పకనే చెప్పారు. టెక్ దిగ్గజం మూడు భాషలు నేర్చుకోగలిగితే, అదే అవకాశం రాష్ట్రంలోని అన్ని విద్యార్థులకు అందుబాటులో ఉండాలని అన్నామలై అన్నారు. మంత్రుల పిల్లలు, మనవరాళ్ళు పాఠశాలల్లో మూడు భాషలు నేర్చుకోవడానికి అనుమతిస్తూ.. ప్రభుత్వ స్కూల్లో విద్యార్థులు మాత్రం రెండు భాషలు మాత్రమే నేర్చుకోవాలని బలవంతం చేయడం దారుణమని అన్నామలై ఆరోపించారు.పార్టీని స్థాపించి డీఎంకేను పదేపదే వ్యతిరేకిస్తున్న నటుడు విజయ్ పార్టీ సహా.. తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్షం డిఎంకే చిరకాల ప్రత్యర్థి అయిన అన్నాడీఎంకే కూడా డీఎంకే వాదనను బలపరుస్తోంది. తమిళులపై ఉచిత వ్యాఖ్యలు చేశారంటూ పార్లమెంటులో మోషన్ కూడా డీఎంకే దాఖలు చేయడంతో తమిళనాడు మొత్తం ఇపుడు ఇదే అంశంపై బీజేపీకి వ్యతిరేకంగా కౌంటర్ ఇస్తుంది. బీజేపీ మాత్రం ఇప్పటికి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయకపోవడంతో ఈ వివాదం ఎక్కడదాకా వెళుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# జగన్ తీరుపై నాయకులు అసంతృప్తి



నెల్లూరు, మార్చి 17, జగన్‌ను ఒకప్పుడు వైసీపీ నేతలు ఎంతో అభిమానించేవారు. జగన్ మాటకు కనీసం ఎదురు చెప్పేవారు కారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. అధినేత తీరుపై నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ లబ్ధి చేకూరే విషయాల్లోనూ జగన్ నిర్లక్ష్యంగా ఉంటున్నారని.. ఇలాగైతే కష్టమే అని అంటున్నారువైసీపీ చీఫ్ జగన్ రాజకీయ వ్యూహాలు పక్కాగా ఉంటాయని.. ప్రత్యర్థులు పసిగట్టలేరని 2024 ఎన్నికలకు ముందు ఆ పార్టీ నేతలు ధీమాగా ఉండేవారు. కానీ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత.. ఆ నమ్మకం పోయింది. దీంతో చాలామంది నేతలు తమదారి చూసుకున్నారు. ఇతర పార్టీల్లోకి వలస వెళ్లారు. అయినా జగన్ తీరులో మార్పు లేదని.. సొంత పార్టీ నేతలే చెబుతున్నారుఎల్లప్పుడూ జగన్ వెన్నంటే ఉండే నాయకులు వెళ్లిపోయినా.. జగన్ పెద్దగా పట్టించుకోలేదు. కనీసం వద్దని చెప్పినట్టు కూడా వార్తలు రాలేదు. పైగా వారిపై సోషల్ మీడియాలో దాడి పెరిగింది. దీనిపైనా వైసీపీలో చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో ఓడిపోవడం, లీడర్లు వెళ్లిపోవడం సంగతి ఎలా ఉన్నా.. రాజకీయంగా లబ్ధి చేకూరే విషయాల్లోనూ జగన్ తీరు మారడం లేదని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు.ఇటీవల అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ప్రతిపక్ష నేత హోదా కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అసెంబ్లీకి వెళ్లకుండా మీడియా ద్వారా ప్రశ్నిస్తానని జగన్ స్పష్టం చేశారు. అయితే.. ఇది సరికాదని కొందరు నేతలు జగన్‌కు చెప్పే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ప్రజల తీర్పును గౌరవించి.. అసెంబ్లీకి వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీయాలని, గత ప్రభుత్వంపై జరిగే దాడిని ఎదుర్కొవాలని నేతలు చెప్పినట్టు సమాచారం. అయినా జగన్ పెద్దగా పట్టించుకోలేదని తెలిసింది.గతంలో చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల దాడి తీవ్రంగా ఉండేది. అయినా చంద్రబాబు సభకు వచ్చి తన బాధ్యతను నిర్వర్తించారు. హద్దులు దాటి ప్రవర్తించిన కారణంగా శపథం చేసి బయటకొచ్చారు. మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెట్టారు. చంద్రబాబును ఆ స్థాయిలో కించపరిచారు కాబట్టే.. ప్రజల్లో ఆయనపై సానుభూతి పెరిగింది. కానీ.. జగన్ ఆ అవకాశాన్ని వదులుకున్నారు' అని కృష్ణా జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత 'హిందుస్తాన్ టైమ్స్ తెలుగు'తో మాట్లాడుతూ చెప్పారు.ప్రస్తుతం జగన్ కేసీఆర్‌తో పోల్చుకుంటున్నారు. ఆయన కూడా అసెంబ్లీకి వెళ్లడం లేదు అని. కానీ.. తెలంగాణలో కేసీఆర్ పరిస్థితి వేరు. ఇక్కడ జగన్ పరిస్థితి వేరు. తెలంగాణలో కేసీఆర్‌పై ఈగ కూడా వాలకుండా.. హరీష్ రావు, కేటీఆర్ చూసుకుంటారు. ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఇక్కడ జగన్‌కు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం దాడిని ఒక్క జగన్ మాత్రమే ఎదుర్కొవాలి. కేసీఆర్ లాంటి సైన్యం జగన్‌కు లేదు' అని ఏలూరు జిల్లాకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెప్పారు.'ప్రభుత్వం నుంచి ఎదురయ్యే అవమానాలు భరించినప్పుడే ప్రజల్లో సానుభూతి పెరుగుతుంది. జగన్ కేవలం సంక్షేమ పథకాలనే నమ్ముకున్నారు. అవతలి నుంచి వచ్చే దాడిని సరైన పద్ధతిలో ఎదుర్కోలేదు. అవాస్తవాలు ప్రచారం చేసినా.. జగన్ సరిగా తిప్పికొట్టలేదు. ఫలితంగానే ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం అయ్యాం. ప్రస్తుతం ప్రభుత్వంపై అంత వ్యతిరేకత లేదు. భవిష్యత్తులో చెప్పలేం. కానీ.. కొన్ని లోపాలు ఉన్నాయి. వాటిని వాడుకోవడంలో మా పార్టీ విఫలం అవుతోంది' అని ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత చెప్పారు'ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు చేసే అవకాశాలు తక్కువ. కానీ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ జగన్‌కు మంచి ఆయుధం. బడ్జెట్‌పై మీడియాలో మాట్లాడటం కంటే.. అసెంబ్లీలో మాట్లాడటమే మంచిది. సభ లోపల అవకాశం లేకపోతే.. మీడియా పాయింట్ దగ్గర అయినా మాట్లాడొచ్చు. కానీ ఆయన ఆ పని చేయలేదు. సంక్రాంతి నుంచే ప్రజల్లోకి వస్తానన్నారు. ఇప్పటికీ రాలేదు. అటు మున్సిపాలిటీల్లో టీడీపీ ఆధిపత్యం పెరుగుతోంది. మా పార్టీ కేడర్‌లో నమ్మకం సన్నగిల్లుతోంది. కేవలం జగన్‌పై అభిమానం ఉన్నవారే పార్టీలో ఉన్నారు. ఇకనైనా వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది' అని గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎంపీ చెప్పారు.

# త్వరలో భూమి మీదకు విలియమ్స్, విల్మోర్

న్యూఢిల్లీ, మార్చి 17, (న్యూస్ పల్స్) ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ లో చిక్కుకుపోయిన సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్ త్వరలోనే భూమి మీదకు తిరిగి రానున్నారు. 9 నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన వీరిని భూమి మీదకు తిరిగి తీసుకొచ్చేందుకు అవకాశం దొరికింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, స్పేస్ ఎక్స్ ప్రయోగించిన క్రూటెన్ మిషన్ లో పురోగతి లభించింది. క్రూటెన్ మిషన్ ఆదివారం ఉదయం 9:37 గంటలకి ఐ ఎస్ ఎస్ తో విజయవంతంగా అనుసంధానమైంది. ఈ విషయాన్ని స్పేస్ ఎక్స్ వీడియో ద్వారా షేర్ చేసింది.తాజాగా అక్కడికి వెళ్లిన నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్ లో ఉన్న సునీతా విలియమ్స్, విల్మోర్ స్థానంలో పనిచేయనున్నారు. అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయాణం మొదలుపెట్టింది. క్రూ-10 మిషన్‌లో భాగంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ దీన్ని నింగిలోకి మోసుకెళ్లింది. ఇందులో అమెరికాకు చెందిన నికోల్ అయర్స్, ఆన్నె మెక్‌క్లెయిన్, జపాన్ ఆస్ట్రోనాట్ టకుయా ఒనిషి, రష్యాకు చెందిన కాస్మోనాట్ కిరిల్ పెస్కోవ్‌లు ఆదివారం ఉదయం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోగా.. ఐఎస్ఎస్ లో ఉన్న సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ వారికి స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. క్రూ 10 వ్యోమనౌకకి చెందిన కమాండర్ మెక్‌క్లైన్ మాట్లాడుతూ.. దాదాపు 28 గంటలు ప్రయాణించి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నామని తెలిపారు. ఐఎస్ఎస్ చేరుకున్నాక విండో నుంచి చూసిన వ్యోమగాములు ఎంతగానో ఆనందించారు. సేఫ్ గా ల్యాండింగ్ చేయడానికి సహకరించిన గ్రౌండ్ కంట్రోల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్స్‌పెడిషన్ 72లో భాగం అయినందుకు చాలా ఉత్సాహంగా ఉన్నానని జపాన్‌కు చెందిన టకుయా ఒనిషి అన్నారు.విలియమ్స్, బుచ్ విల్మోర్ జూన్ 2024లో స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో ఐఎస్ఎస్ కు చేరుకున్నారు. కేవలం 10 రోజుల పాటు అక్కడ ఉండి, అనంతరం తిరిగి రావాలని నాసా శాస్త్రవేత్తలు భావించారు. కానీ బోయింగ్ స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో టెక్నికల్ ప్రాబ్లమ్ రావడంతో వారి తిరుగు ప్రయాణం పలుమార్లు వాయిదా పడింది. సాంకేతిక సమస్యలతో వ్యోమగాములు గత ఏడాది జూన్ నుంచి ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయారు. ప్రస్తుతం అమెరికా సానా, ఎలాన్ మస్క్ స్పేస్ ఎక్స్ ఆపరేషన్ క్రూ 10 మిషన్ ద్వారా ఐఎస్ఎస్ లో చిక్కుకున్న వ్యోమగాములు మార్చి 19 వరకు భూమి మీదకు వచ్చే అవకాశం ఉంది. సునీతా విలియమ్స్ అండ్ టీం ఐఎస్ఎస్ నుంచే పండుగల సమయంలో ఇంటరాక్ట్ అవుతున్నారు. అక్కడి విశేషాలను వీలు చిక్కినప్పుడల్లా షేర్ చేసుకున్నారు.

# వేసవిలో తాగు, సాగు నీరు, విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలి మంత్రి కోమటిరెడ్డి



**నల్గొండ ప్రజాబలం ప్రతినిధి**ఈ వేసవి లో నల్గొండ జిల్లాలో సాగు, తాగునీరూ,విద్యుత్ కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో సాగునీటి సౌకర్యం పెరగడం, ఇతర కారణాలవల్ల విద్యుత్ డిమాండ్ సైతం బాగా పెరిగిందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ఈ వేసవిలో సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో అధికారులతో వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్తు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.


వ్యవసాయ శాఖ సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో సుమారు లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం ఎక్కువ వరి ధాన్యం ఐకెపి సెంటర్లకు వచ్చే అవకాశం ఉన్నందున ముదునుండే ఏర్పాట్లు చేసుకోవాలని, ధాన్యం కొనుగోలుకు అవసరమైన టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. కాగా వ్యవసాయ శాఖకు 80 క్లస్టర్లు ,ఏఈ పోస్టులు కావాలని జిల్లా వ్యవసాయ అధికారి సమావేశం దృష్టికి తీసుకురాగా, మంత్రి తక్షణమే స్పందించి సమావేశ మందిరం నుండే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో ఫోన్ లో మాట్లాడి క్లస్టర్లను మంజూరు చేయాలని కోరగా, అందుకు మంత్రి సమ్మతించారు.నెలలోపు ఈ క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. జిల్లాలో సనారకం ధాన్యాన్ని ప్రోత్సహించాలని, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలతోపాటు ,తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఇటు ఇరిగేషన్ అధికారులు , అటు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో విద్యుత్ కి ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, నల్గొండ పట్టణంతో పాటు, గ్రామాలలో ఎలాంటి కోతలు ఉండవద్దని, ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీటిని అందించేందుకు జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. జిల్లాలో అధికారులు అందరూ రాత్రి, పగలు కష్టపడి పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకొస్తున్నారని, గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం దాన్యం సేకరణ బాగా చేశారని అదే విధంగా రబిలో సైతం చేయాలని చెప్పారు.వచ్చే నెల ఒకటి లేదా రెండు తేదీలలో 36 కోట్ల రూపాయలతో నిర్మించనున్న జిల్లా కలెక్టర్ కార్యాలయ అదనపు భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనతో పాటు, ,15 సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన ,మాడుగుల పల్లి పోలీస్ స్టేషన్ భవన శంకుస్థాపన, అలాగే ఇతర ముఖ్యమైన కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలో కొత్త పోలీస్ క్వార్టర్ల నిర్మాణం మంజూరు రాబోతున్నదని, అలాగే డిఎస్పీ ఆఫీస్ మంజూరైన కారణంగా వాటికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు.520 కోట్ల రూపాయలతో మంజూరైన బైపాస్ రోడ్డు టెండర్లు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు..సమావేశం ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎమ్మార్పీ ,ఎస్ఎల్బీసీ హై లెవెల్ కెనాల్ ద్వారా అందిస్తున్న సాగునీరు, పంటల పరిస్థితి, తాగునీరు, విద్యుత్తు, తదితర అంశాలపై వివరాలను మంత్రికి తెలియజేశారు.

# తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై రగడ..




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 17**, ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు త్వరలో మారనుంది. బదులుగా ప్రముఖ తెలంగాణ కవి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును ఆ యూనివర్సిటీకి పెట్టనున్నారు. ఈ మేరకు తెలుగు విశ్వవిద్యాలయం చట్టానికి సవరణ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 15న అసెంబ్లీలో బిల్లు కూడా ప్రవేశపెట్టగా.. మంత్రి మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గత సెప్టెంబరు 20న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సురవరం పేరు పెట్టాలని నిర్ణయించగా.. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేశాఉ. పదో షెడ్యూల్‌లో ఈ వర్సిటీ ఉండటంతో ఇప్పటివరకు పేరు మార్చలేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కేవలం తెలంగాణ విద్యార్థులకు మాత్రమే ఈ యూనివర్సిటీలో ప్రవేశాలను పరిమితం చేశారు. దీంతో 1985 డిసెంబరు 2న స్థాపించిన తెలుగు యూనివర్సిటీ పేరును రేవంత్ ప్రభుత్వం మార్చిందితెలుగు యూనివర్సిటీకి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని శ్రీరాములు జయంతి సందర్భంగా కేంద్ర బండి సంజయ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు గొప్ప దేశభక్తుడు. అలాంటి మహనీయుని పేరును తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సురవరం ప్రతాప్‌రెడ్డి అంటే మాకు గౌరవం ఉంది. ఆయన తెలుగు భాష ఉన్నతికి కృషి చేశారు. తెలుగు భాషాభివృద్ధి కార్యక్రమాలకు ఆయన పేరును జరిపితే బాగుంటుంది. కానీ వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం ఆయనను అవమానించడం అవుతుంది. ఆంధ్రా మూలాలు ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగించిన కాంగ్రెస్ సర్కారు.. ఎన్టీఆర్ పార్కు, కాసు బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి పార్కుల పేర్లను, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం పేరును మార్చగలదా? అంటూ ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం తమ తప్పిదాన్ని సరిదిద్దుకొని తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడంపై ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడుకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28న జన్మించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో న్యాయవాద విద్య అభ్యసించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. 1952లో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా హైదరాబాద్ స్టేట్ శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఏడాదే 1953 ఆగస్టు 25న ఆయన మృతి చెందారు. ఆయన రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్రకు 1955లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది.

# గ్రేటర్ ఎన్నికల్లో జనసేన పోటీ




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17,** తెలంగాణలో పోటీ చేసేందుకు జనసేన అడుగులు వేస్తోంది. జీహెచ్ఎంసీ ఎన్నికలు టార్గెట్‌గా తెలంగాణలో అడుగుపెట్టాలని జనసేన భావిస్తోంది. అందులో భాగంగా తెలంగాణపై పవన్ కళ్యాణ్ స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. నిన్న జరిగిన జనసేన ఆవిర్భావ సభలో తెలంగాణ గురించే పవన్ ఎక్కువగా మాట్లాడారు.మరోవైపు తెలంగాలో తిరిగి యాక్టివ్ అయ్యేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. అదే సమయంలో తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోంది. సనాతన ధర్మం పేరుతో హిందూవులను పోలరైజ్ చేస్తున్న పవన్ కళ్యాణ్ తెలంగాణలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.ఏపీలో లాగే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీలో కూటమి ఫార్ములా సక్సెస్ కావడంతో తెలంగాణలోనూ దాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో పవన్ ఉన్నట్లు తెలుస్తుంది. నిన్నటి జనసేన సభలో తెలంగాణ గురించే పవన్ కళ్యాణ్ ఎక్కువగా మాట్లాడారు. తనకు పునర్జన్మ నిచ్చింది తెలంగాణ అంటూనే జనసేనకు జన్మస్థలం తెలంగాణ అని, కర్మ స్థలం ఆంధ్రప్రదేశ్ అంటూ చెప్పుకొచ్చారు. అంటే రెండు రాష్ట్రాల్లోనూ యాక్టివ్‌గా ఉండేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోందితెలంగాణలో బీజేపీ బలపడుతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గతంకంటే ఎక్కువ స్థానాలు గెలుపొందడంతో పాటు మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీజేపీ గతంకంటే ఎక్కువ సీట్లను గెలుసుకుంది. 8 అసెంబ్లీ, 8 పార్లమెంట్ స్థానాలు గెలుసుకుంది. ఈ క్రమంలో తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం ఉండడంతో జనసేనతో కలిసి కూటమిగా ఉండేందుకు ఆసక్తి చూపుతున్నాయి.వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా తన సత్తా చాటాలని కూటమి భావిస్తోంది. తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లను ఎదుర్కొవాలంటే కూటమిగా పోటీ చేయడమే మేలు అన్న ఆలోచనలో ఆ మూడు పార్టీల నేతలున్నారు. ఏపీలో కూటమి విజయం సాధించడంతో అదే జోష్‌తో తెలంగాణలోనూ తమ సత్తా చాటాలని ఆ మూడు పార్టీలు భావిస్తున్నాయి. అందులో భాగంగా జీహెచ్ఎంసీ ఎన్నికలే లక్ష్యంగా మూడు పార్టీలు పావులు కదుపుతున్నాయి.

# బంగారం ధర పెరుగుతుందా... తగ్గుతుందా...



ముంబై, మార్చి 17, (న్యూస్ పల్స్) బంగారం ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రానున్న రెండు, మూడు నెలల్లో భారీ సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఈ క్రమంలో బంగారం ధరలు సామాన్యులను భయపెడుతున్నాయి. ఇంత ధర ఉంటే పెళ్లిళ్ల సమయంలో ఎలా కొనాలంటూ తలలు పట్టుకుంటున్నారు. భారతీయ సంప్రదాయంలో బంగారు ఆభరణాలకు ఉన్న ప్రాముఖ్యత గురించి తెలిసిందే. ముఖ్యంగా పెళ్లిళ్లలో వధూవరులకు బంగారు ఆభరణాలను కచ్చితంగా అలంకరిస్తారు. పెళ్లి కూతురికి అయితే ఎక్కువ మొత్తంగా బంగారు ఆభరణాలు అవసరం. కానీ, ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తుంటే.. పెళ్లి పెట్టుకున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మన దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,000కు మించిపోయింది.అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం 3,000 డాలర్లను తాకింది. ఇంత భారీగా పెరిగినా.. త్వరలోనే ధరలు తగ్గుతాయనే ఆశ ఉండేది. కానీ, ప్రస్తుతం ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొంది. ధర ఇప్పట్లో తగ్గదేమో అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పెళ్లిళ్ల సీజన్ వచ్చేసింది. రోజురోజుకూ ధర పెరగడం చూసి పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వధూవరుల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. ధర పెరిగి కొనేవాళ్లు కరవయ్యారని, ఆభరణాల వర్తకులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం వరకూ ధర ఇంకా పెరగకపోవచ్చని నిపుణులు అంచనా వేశారు. కానీ డొనాల్డ్ ట్రంప్, అమెరిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టారిఫ్‌లు పెంచడంతో అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయి.కొన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ఎంతో భద్రమైన ఆస్తిగా భావించే బంగారానికి డిమాండ్ పెరగడంతో ధర పెరిగింది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం సందర్భంగా ఔన్సు బంగారం ధర 1,000 డాలర్లకు చేరింది. నాలుగేళ్ల క్రితం కొవిడ్ ముప్పు ముంచుకొచ్చినప్పుడు 2,000 డాలర్లు పలికింది. మళ్లీ ఇప్పుడు 3,000 డాలర్లకు చేరుకుంది. ఆర్థిక సంక్షోభం ముంచుకొచ్చినప్పుడు బంగారం ధర రికార్డు స్థాయికి చేరుతున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి తోడు గత కొంతకాలంగా వివిధ దేశాల్లోని కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొని నిల్వ చేస్తున్నాయి. 2022 నుంచి ఏటా 1,000 టన్నులకు పైగా బంగారాన్ని కేంద్ర బ్యాంకులే కొనుగోలు చేశాయి. ఇందులో భారత రిజర్వు బ్యాంకు ముందుంటోంది. చైనాలో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిని అక్కడి మదుపర్లు ఇటీవల పసిడిని ఎక్కువగా కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 3,000 డాలర్ల దగ్గర ఎన్నాళ్లు ఉంటుంది, ఇంకా పెరుగుతుందా, లేక తగ్గుతుందా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది.వర్తకులు, పెట్టుబడి నిపుణులు ఎవరూ దీనికి సమాధానం చెప్పలేకపోతున్నారు. అమెరికా టారిఫ్‌లు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇతర ప్రతికూల పరిస్థితులు కొనసాగినంత కాలం ధర తగ్గదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధర భారీగా పెరగడంతో ఆభరణాల వ్యాపారం తగ్గింది. బంగారు ఆభరణాల అమ్మకాలు 70 శాతం తగ్గినట్లు సమాచారం. పాత బంగారం ఇచ్చి కొత్త ఆభరణాలు తీసుకోవడం పెరిగిందని, ఎంతో తప్పనిసరి అయితే తప్పించి కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం తెలుస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా బంగారం ధర తగ్గే సూచనలైతే కనిపించడం లేదని నిపుణులు అంటున్నారు.

# వరంగల్ సభ నుంచి ఇక టీఆర్ఎస్సే

**వరంగల్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17**,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ పేరును మార్చేందుకు పార్టీ అధినేత కేసీఆర్ సిద్ధమయినట్లు తెలిసింది. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఈ ప్రకటన చేయనున్నారని సమాచారం. వరంగల్ లో తిరిగి తెలంగాణ రాష్ట్ర సమితిగా ప్రకటించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 27వ తేదీన రజతోత్సవ వేడుకలు వరంగల్ వేదికగా జరగనున్నాయి. ఈ సభకు దాదాపు ఐదు నుంచి ఆరు లక్షల మంది కార్యకర్తలను సమీకరించాలని నిర్ణయించారు. ఈ సభలోనే బీఆర్ఎస్ నుంచి తిరిగి టీఆర్ఎస్ గా మారుతుందని ముఖ్య నేతలు చెబుతున్నారు. ఈ మేరకు కేసీఆర్ ముఖ్యనేతలతో జరిగిన సమావేశంలో తన అభిప్రాయాన్ని కూడా వెల్లడించినట్లు తెలిసింది. నేతల డిమాండ్ కూడా అదే కావడంతో దీనికి ఇక తిరుగుండదని భావిస్తున్నారు. ఇరవై ఐదో ఏట అడుగు... 2001 ఏప్రిల్ 27వ తేదీన తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడింది. అంటే ఈ ఏడాది ఏప్రిల్ 27వ తేదీ నాటికి ఇరవై ఐదో ఏట అడుగుపెడుతుంది. ఈ ఇరవై ఐదేళ్ల కాలంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. 2001 నుంచి 2014 వరకూ అనేక ఎన్నికల్లో వివిధ పార్టీలతో పొత్తు పెట్టుకుని చట్ట సభల్లో చోటు దక్కించుకున్న నాటి టీఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీగా ఆవిర్భవించినప్పటికీ రాజకీయ పోరాటంతోనే సాధ్యమని కేసీఆర్ బలంగా నమ్మారు. రాజకీయ పోరాటాలతో పాటు లాబీయింగ్ అవసరమని భావించి ఎప్పటికప్పుడు రాజీనామాలు చేస్తూ ఉప ఎన్నికల్లో తిరిగి విజయం సాధిస్తూ తెలంగాణ సెంటిమెంట్ ను ప్రజల్లో బలంగా నింపగలిగారు. అలా దాదాపు పదమూడేళ్ల పోరాటంలో కేసీఆర్ రక్తం చిందించకుండా రాష్ట్రాన్నిసాధించగలిగారు. ఇదే సమయంలో తెలంగాణ జేఏసీని ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణను రూపొందించడమే కాకుండా అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేయడంలో కూడా కేసీఆర్ సక్సెస్ అయ్యారు. తెలంగాణలో అందరి నోట ఏకైక నినాదం ప్రత్యేక రాష్ట్రం. ఈ నినాదాన్ని అందుకుని కేసీఆర్ ఆమరణదీక్ష చేయడంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దిగి వచ్చింది. ఇలా టీఆర్ఎస్ ఉద్యమ పార్టీగా వచ్చినా తర్వాత జనం గుండెల్లో గూడుకట్టుకున్న సెంటిమెంట్ తో 2014, 2018 ఎన్నికల్లో వరసగా రెండుసార్లు అధికారంలోకి రాగలిగింది. అయితే రెండు సార్లు అధికారంలోకి రావడంతో కేసీఆర్ ఫోకస్ జాతీయ రాజకీయాలపై పడింది. ఆయన ఢిల్లీని శాసించాలనుకున్నారు 2023 ఎన్నికలకు ముందు... అదే రాష్ట్రంలో పార్టీ పాలిట శాపంగా మారిందంటారు. 2023 ఎన్నికలకు ముందు అంటే 2022 డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మారుస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో గెలవాలని, మహారాష్ట్ర,ఒడిశా, ఏపీలలో సీట్లు సాధించాలనుకున్న గులాబీ బాస్ కు 2023 ఎన్నికల్లో ప్రజలు ఝలక్ ఇచ్చారు. దీంతో నేతలు కూడా ఎక్కువ మంది టీఆర్ఎస్ ను ఇంటి పార్టీగా భావించారని, బీఆర్ఎస్ వల్లనే ఓటమి చెందామని పలువురు నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ఏప్రిల్ 27వ తేదీన వరంగల్ లో జరిగే బహిరంగ సభలో తిరిగి బీఆర్ఎస్ ను టీఆర్ఎస్ గా మార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

# ఏపీలో టెన్త్ పరీక్షలు షురూ



విజయవాడ ఆంధ్రప్రదేశ్ లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమైయా యి. సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగ నున్నాయి. ఇందుకోసం అధికారు లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష జరగ నుంది. పరీక్ష ప్రారంభమయ్యే వర కూ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిం చనున్నారు. ఇందుకోసం 3,450 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పదోతరగతి పరీక్షల్లో మొత్తం 6,19,275 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ప్రాథమిక విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగకుం డా ముఫ్ఫయి స్వ్కాడ్ లను ఏర్పా టు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లు, నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తమ ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయా ణాన్ని అమలు చేస్తున్నారు.



# టీయూడబ్ల్యూజే ను విమర్శిస్తే ఖబడ్దార్

**జర్నలిస్టులు అనుభవిస్తున్న ప్రతి సంక్షేమం టియుడబ్ల్యూజే కృషి ఫలితమే**

**-కరీంనగర్ జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి**

**-టియుడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ**




**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి** నిరంతరం జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టియుడబ్ల్యూజె ను విమర్శిస్తే సహించేది లేదని టియుడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ అన్నారు. టి యు డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన టీయూడబ్ల్యూజే కరీంనగర్ జిల్లా శాఖ విస్తృత సాయి కార్యవర్గ సమావేశం స్థానిక ఎస్ ఆర్ ఆర్ బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి రామనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ 70 సంవత్సరాల్లో అనేక విజయాలు సాధించిన ఘనత టీయూడబ్ల్యూజే దేనని అన్నారు. అనేక అసంఘటిత శక్తులు యూనియన్ విచ్ఛిన్నం చేయాలని చూసిన కొట్లాడి గెలిచిన సంఘం మనది అన్నారు. సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి అత్యధిక జర్నలిస్టుల సభ్యత్వం కలిగిన సంఘంపై ఉసిగొలిపిన కొట్లాడి నిలబడిన చరిత్ర టీయూడబ్ల్యూజేకు దక్కిందన్నారు. ఈరోజు ప్రతి జర్నలిస్టు పొందుతున్న సంక్షేమం టియుడబ్ల్యూజే కృషి ఫలితమేనని అన్నారు. అనేక ప్రత్యర్థి యూనియన్లు అసత్య ఆరోపణలతో జర్నలిస్టులను తప్పిదారి పట్టిస్తూ కోర్టులను సంప్రదించిన టి యు డబ్ల్యూ జె యూనియన్ నిబద్ధతను చూసి ప్రత్యర్థి సంఘాలకు కోర్టు లు మొట్టికాయలు వేసిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. నాటికి నేటికీ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న యూనియన్ ఏదన్నా ఉందంటే అది టీ యు డబ్ల్యూ జెనన్నారు. కరీంనగర్ పట్టణ జర్నలిస్టుల నివేషణ స్థలాల సమస్య జటిలం అయ్యేందుకు గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. జర్నలిస్టులకు సరైన ప్రోసిడింగ్ ఇవ్వకుండా జర్నలిస్టుల మధ్య అవరోధం సృష్టించారన్నారు. అయినా జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. నివేషణ స్థలాల సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర కమిటీ అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందన్నారు. టి యు డబ్ల్యూ జె నుండి బహిష్కృత నేత పైశాచిక ఆనందంతో కేసులు వేస్తూ ఆనందిస్తున్నాడన్నారు. వేసిన కేసులు కోర్టులో వీగిపోయి ఆయనకు పరాభవం తప్పదన్నారు. మూడు దశాబ్దాల పాటు యూనియన్ తో ప్రయోజనం పొంది సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి వేలివేయబడ్డ నాయకుడు నేడు జర్నలిస్టులను తప్పుదోవ పట్టించడం పట్ల కరీంనగర్ జర్నలిస్టులు జాగ్రత్తగా ఉండాలన్నారు. జర్నలిస్టులంతా సంఘటితంగా ఉండి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని అడ్డుకోవాలని అన్నారు. జిల్లా జిల్లా నాయకత్వం జర్నలిస్టులతో సమన్వయంతో ఉంటూ రాష్ట్ర కమిటీ చేసే కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని సూచించారు. జర్నలిస్టుల ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తో చర్చలు జరిపామని ఆయన సానుకూలంగా స్పందించారని అతి త్వరలో మనం కోరుకునే విధంగానే రిజల్ట్ వస్తుందన్నారు. జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ ను సైతం పునరుద్ధరించాలన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన అక్రిడేషన్ జీవో అస్తవ్యస్తంగా ఉండడంతో నూతన జీవో జారీ చేయాలని కోర్టు తీర్పు నివ్వడంతో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఇచ్చిన నివేదిక మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అందజేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందుతుందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా మండల స్థాయి రిపోర్టర్లకు సైతం అక్రిడిటేషన్లను అందించిన ఘనత టి యు డబ్ల్యూ జే కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొయ్యడ చంద్రశేఖర్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్,.. కరీంనగర్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఊరేడి రవీందర్ ఐజేయూ సభ్యుడు జానంపేట మారుతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇమామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యులు బల్మూరు విజయ్ రావు, మహేంద్ర చారి, కోశాధికారి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల సంపత్, శైలేందర్ రెడ్డి ఎండి సుకుర్, భరణి కుమార్ సంయుక్త కార్యదర్శులు సిర్ర తిరుపతి కొండల్ రెడ్డి పొలు సంపత్ దాడి సంపత్ లతోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాకు నీటి సమస్య ముప్పు

## ఎడారిగా మారనున్న ఎల్ఎండీ?

**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17,** ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నీటి సమస్య ముప్పు ముంచుకొస్తుంది. జలాశయాల్లో శరవేగంగా నీటి మట్టాలు ఘననీయంగా పడిపోతున్నాయి. ఎండవేడి వడగాడ్పులతో పంట నహపాలాలు తడారి ఎండిపోతున్నాయి. సాగు నీరు అందించి ఎండుతున్న పంటలను కాపాడాలని రైతులతోపాటు రాజకీయ పార్టీలు ఆందోళన బాట పట్టాయి.

దీంతో పంటలను కాపాడేందుకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా నీటి విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తుండడంతో జలాశయాలు ఖాళీ అవుతున్నాయి. ఈ నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాలని సర్కారు నిర్ణయించడంతో ప్రస్తుతం ఉన్న నీళ్ళు వారం పదిరోజుల్లో ఖాళీ అయ్యే పరిస్థితులు కనిపిస్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది.కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేర్ డ్యామ్ నీటి నిలువ సామర్థ్యం 24 టిఎంసీలు కాగా ప్రస్తుతం 9 టిఎంసి నీళ్ళు మాత్రమే ఉన్నాయి. రోజుకు అర టిఎంసి 6 వేల క్యూసెక్కుల నీటిని కాకతీయ కెనాల్ ద్వారా రైతులకు సాగు నీరు అందిస్తున్నారు. ఎల్ఎండి కి ఎగువన ఉన్న మిడ్ మానేర్ నుంచి 2500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ఎల్ఎండి నుంచి ఆరు వేల క్యూసెక్కుల నీటిని సాగు నీరుగా కాకతీయ కాలువకు విడుదల చేస్తుండగా 300 క్యూసెక్కుల నీళ్ళు మిషన్ భగీరథతోపాటు ఎండ వేడికి ఆవిరైపోతున్నాయి. ఇదే మాదిరిగా సాగునీరు ఇస్తే నాలుగు రోజులకు ఒక టిఎంసి చొప్పున ఈ నెలాఖరు వరకు 4 టిఎంసిల నీళు ఖాళీ అయి ఎల్ఎండి లో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరనుంది. కరీంనగర్ సిద్దిపేట జిల్లా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ మొదటి వారంలోనే డెడ్ స్టోరేజ్ నుంచి త్రాగునీరు తీసుకునే పరిస్థితి ఉంటే? మే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తం అవుతుంది.రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న మిడ్ మానేర్ శ్రీ రాజరాజేశ్వర జలాశయం పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్యం 27 టిఎంసిలు. ప్రస్తుతం 12.5 టీఎంసీల నీళు ఉన్నాయి.

మిడ్ మానేర్ కు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా 660 క్యూసెక్కుల నీరు వస్తుండగా మిడ్ మానేర్ నుంచి 2500 క్యూసెక్కుల నీటిని దిగువన ఎల్ఎండి కి మరో 650 క్యూసెక్కుల నీటిని రైట్ మేయిన్ కెనాల్ కు విడుదల చేస్తున్నారు. మరో 220 క్యూసెక్కుల నీళ్ళు ఆవిరైపోతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.ఇదే మాదిరిగా ఎండలు ముదిరి నీటిని విడుదల చేస్తే మార్చి మాసాంతం వరకు మిడ్ మానేర్ లో సైతం భారీగా నీళ్ళు తగ్గనున్నాయి. ఇప్పటికే మిడ్ మానేర్ పై ఆధారం పడ్డ వేములవాడ సిరిసిల్ల మానకొండూర్ నియోజకవర్గాల్లో సాగునీరు అందక వేలాది ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోయి రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఉమ్మడి జిల్లాకు జీవనాదారంగా ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో సైతం నీటిమట్టం గణనీయంగా తగ్గింది. 20 టిఎంసీల నీటి నిలువ సామర్థ్యం గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 10 టిఎంసిల నీళ్ళు ఉన్నాయి. హైదరాబాద్ తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో త్రాగునీటి అవసరాలకు ఆ నీళ్లు సరిపోయే అవకాశం ఉంది. వాటిని పొదుపుగా వర్షాకాలం ప్రారంభం అయ్యేవరకు ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రస్తుతం ఎల్ఎండీ, మిడ్ మానేర్ లో ఘననీయంగా నీటిమట్టం పడిపోతుండడంతో ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోసి సాగునీరు దేవుడెరుగు కనీసం త్రాగునీటి తిప్పల రాకుండా చూడాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు. ముంచుకొస్తున్న మంచినీటి ముప్పును గమనించి అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నీటి కష్టాలు రాకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయింది. మేడిగడ్డ బ్యారేజ్ కి పగుళ్లు రావటంతో? కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టింది మరమ్మత్తు పనులు ముందుకు సాగక కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్, అన్నారం సరస్వతి బ్యారేజ్, సుందిళ్ళ వద్ద పార్వతి బ్యారేజీలు నీళు నిలువ చేయకుండా మొత్తం ఖాళీ చేసి గోదావరిని ఏడారిగా మార్చారు. ఇప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు వచ్చే పరిస్థితి లేదు

# ప్రజలకు పులుల టెన్షన్

**వరంగల్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 17,** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు పులుల టెన్షన్ పట్టుకుంది. అటవీ ప్రాంతంలోని గ్రామాల శివార్లలో పులి సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపించడం, అడపాదడపా మూగ జీవాలపై అటాక్ చేస్తుండటంతో అక్కడి ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రెండు పులుల సంచారం జనాలను కలవరానికి గురిచేస్తోంది.జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ ఏజెన్సీ ప్రాంతంలో ఆడ పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని అన్నారం క్రాస్ బీరసాగర్ పోచమ్మ ఆలయం వద్ద రెండు రోజుల కిందట కొంతమంది వాహనదారులు పులిని చూసినట్టు చెబుతున్నారు. అటుగా వచ్చిన పులిని గమనించి, గ్రామస్థులకు సమాచారం చేరవేయగా.. ఆ విషయం కాస్త వైరల్ అయ్యింది(గ్రామస్థులు సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. పులి జాడను కనుగొనే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్యంగా పులి పాద ముద్రలను గుర్తించారు. మహదేవపూర్ అటవీ ప్రాంతంలో సంచరిస్తుంది ఆడ పులిగా భావిస్తున్నారు. పులిని గుర్తించేందుకు అటవీ ప్రాంతంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తరచూ పులి కదలికలతో మహదేవపూర్ మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఓ వైపు మహదేవపూర్ ఏజెన్సీ ఏరియాలో ఆడపులి సంచరిస్తుండగా.. భూపాలపల్లి, కాటారం మండలాల్లో మగపులి తిరుగుతుండటంతో జనాలు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం పులి కదలికలను గుర్తించిన కొందరు స్థానికులు.. అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేయడంతో వెంటనే జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్లు కాటారం, భూపాలపల్లి మండలాల్లో పర్యటించారు. అక్కడున్న పులి అడుగులను గుర్తించి, దానిని మగపులి గా భావిస్తున్నారు.మహదేవపూర్, కాటారం మండలాల్లో సంచరించేది ఒకటే పులి అని భావించారు. కానీ అక్కడున్న అడుగులు, ఇక్కడున్న అడుగులకు సరిపోలకపోవడంతో రెండు పులులు సంచరిస్తున్నట్టుగా నిర్ధారణకు వచ్చారు. కాటారం మండలంలో పులి అడుగులు గుర్తించి, అది మగపులిగా తేల్చారు. ఆ పులి కాటారం మండలం మేడిపల్లి, కొత్తపల్లి మీదుగా భూపాలపల్లి మండలం రాంపూర్, కమలాపూర్ గ్రామ శివార్లలో సంచరిస్తుండటంతో.. అటు గ్రామస్థులతో పాటు ఆఫీసర్లు కూడా అలర్ట్ అయ్యారు.జిల్లాలో రెండు వైపులా రెండు పులులు సంచరిస్తుండటంతో కాటారం, మహదేవపూర్ మండలాల్లో టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. జనాలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. కనీసం పశువులను మేతకు తీసుకెళ్లాలన్నా భయాందోళన చెందుతున్నారు. పులుల సంచారం నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సమీప గ్రామాల ప్రజలను అలర్ట్ చేసే పనిలో పడ్డారు. అటవీ ప్రాంతాల్లోకి పశువుల కాపరులు ఎవరూ వెళ్లొద్దని సూచిస్తున్నారు.పంట పొలాల వద్ద కరెంట్ తీగలు, ఉచ్చులు పెట్టొద్దని, ఒకవేళ ఎవరైనా పులులను హాని కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఒకవేళ ఎవరికైనా పులి ఎదురైతే దాని కళ్లలోకి నేరుగా చూడొద్దని, వెనక్కి తిరగకుండా వెనక్కి నడవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో పరుగెత్తకూడదని, పెద్ద శబ్ధం చేస్తూ ఉండాలని సూచించారు. ఎవరికైనా పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు

# అధ్వాన్నంగా మారుతున్న ఓఆర్ఆర్ నిర్వహణ

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17,** ఔటర్ రింగ్ రోడ్డు.. హైదరాబాద్ నగరానికి మణిహారం. నగరంలో ట్రాఫిక్ తగ్గించి, సాఫీగా వెళ్లేందుకు దీన్ని నిర్మించారు. గతంలో హెచ్ఎండీఏ పర్యవేక్షణలో ఉన్నప్పుడు బాగుండేది. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. ఫలితంగా నిత్యం వేలాదిమంది వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణం.. రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. స్పీడ్ కంట్రోల్, ఇతర సమాచారం తెలిపే డిజిటల్ సైన్ బోర్డులు పని చేయడం లేదు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ లైన్లలో ఏ వాహనాలు వెళ్లాలో తెలియక.. ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధింత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.హైదరాబాద్ మహానగరం చుట్టూ.. 158 కిలో మీటర్ల మేర ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. దీని పర్యవేక్షణ బాధ్యత గతంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఉండేది. ఆ తర్వాత ప్రైవేటు సంస్థకు 30 ఏళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం లీజుకిచ్చింది. దీనిపై ప్రస్తుతం నిత్యం ఒకటిన్నర లక్షల వాహనాలు ప్రయాణిస్తున్నాయి. నెలకు దాదాపు రూ.70 కోట్ల వరకు టోల్ వసూలవుతోంది. అయినా నిర్వహణ సక్రమంగా లేదనే విమర్శలు ఉన్నాయి.8 వరుసలతో ఈ రోడ్డు ఉండగా.. మధ్య నుంచి తొలి 2 వరుసల్లో 120 కిలోమీటర్ల వేగంతో వాహనాలు వెళ్లాలి. తర్వాత రెండు లైన్లలో 80 కిలోమీటర్ల వరకే వేగ పరిమితి ఉంది. ఈ సమాచారాన్ని వాహనదారులకు తెలిసేలా గతంలో రోడ్డు మధ్యలో సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే.. వచ్చే ఇంటర్‌ఛేంజ్ పేరు, ఎక్కడ దిగితే ఎటువైపు వెళ్లొచ్చు వంటి సమాచారం ఇందులో పొందుపర్చారు.రాత్రి సమయంలో కనిపించేలా ఫ్లడ్‌లైట్లు అందుబాటులోకి తెచ్చారు. స్పీడ్ కంట్రోల్ కోసం పోలీసుల ఆధ్వర్యంలో పహారా ఉంది. కానీ.. చాలా ప్రాంతాల్లో సైన్ బోర్డులు పనిచేయడం లేదు. భారీ వాహనాలు తొలి రెండు లైన్లలోకి వచ్చేస్తున్నాయి. ఫలితంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ గన్ల వ్యవస్థ నామ మాత్రంగానే ఉంది. ఎక్కడపడితే అక్కడ రోడ్డుపక్కన భారీ వాహనాలు నిలిపేస్తున్నారు. ఈ కారణంగా వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు.. దగ్గరకు వచ్చే వరకు అవి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. లైన్లతో ఈ రింగ్ రోడ్డు నిర్మించినా.. వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అప్పుడప్పుడు ఫాస్టాగ్ పనిచేయక టోల్‌బూత్‌ల వద్ద వాహనాలు నిలిచిపోతున్నాయి. 3 సెకన్లలోపే స్కానింగ్ ప్రక్రియ పూర్తి కావడం లేదు. దీంతో వెనక వచ్చే వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా దీని నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఉన్నప్పుడే నిర్వహణ బాగుండేదని చెబుతున్నారు.

# ఇక తెలంగాణలో కూటమి ఎంట్రీ...

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17**, జయకేతనం పేరిట పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ సమావేశంలో పవన్ కల్యాణ్ చాలా విషయాలపై స్పందించారు. ప్రత్యర్థుల విమర్శలకు కౌంటర్ ఇస్తూనే పార్టీ భవిష్యత్ కార్యచరణపై స్పష్టమైన సంకేతాలు పంపారు. రేపటి భవిష్యత్‌లో తెలంగాణ, తమిళనాడులో పోటీ ఖాయమనేలా పవన్ ప్రసంగం సాగింది. తెలంగాణలోకి ఎంట్రీ అవ్వడానికి బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఆ ప్రయత్నాలు ఫలించేలా గతేడాది ఎంపీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించింది. ఈ మధ్య ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అనూహ్యంగా పుంజుకుంది. ఇప్పుడు తన ఫోకస్ లోకల్‌బాడీ ఎన్నికలపై పెట్టింది. ఈ టైంలో పవన్ కల్యాణ? చేసిన ప్రసంగం ఆసక్తి? రేపిస్తోంది. జనసేనాని తన ప్రసంగాన్ని తెలంగాణ ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య చెప్పిన పంక్తులతో ప్రారంభించారు. "రుద్రవీణ వాయిస్తా....అగ్నిధార కురిపిస్తా... తిరుగుబాటు జెండా ఎగురేస్తా... దుష్టపాలన నుంచి విముక్తి కలిగిస్తా" అనేదే జనసేనకు బలమని చెప్పుకొచ్చారు. జనసేన పుట్టింది తెలంగాణలోనేని గుర్తు చేశారు. గద్దర్ గురించి ప్రస్తావించారు. గతంలో ఎంఐఎం చేసిన కామెంట్స్‌ను తప్పుపట్టారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడి సభపైకి పిలిచి సన్మానం చేశారు. తెలంగాణ తనకు పునర్జన్మ ఇచ్చిందని జనసేనాని చెప్పుకొచ్చారు. ప్రజారాజ్యం టైంలో విద్యుత్ షాక్ తగిలితే కొండగట్టు ఆంజనేయస్వామి దయతో బతికానంటూ గుర్తు చేశారు. చాలా అంశాల్లో తెలంగాణతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తున్నారు. దీంతో తెలంగాణలో పార్టీ విస్తరణ ఖాయమేనంటూ సంకేతాలు ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లో అనుసరించిన ఫార్ములా తెలంగాణలో కూడా కూటమి అనుసరించనుందని ఎప్పటి నుంచో పుకార్లు వస్తున్నాయి. టీడీపీ సైలెంట్‌గా నాయకులను సిద్ధం చేస్తోంది. వివిధ పార్టీల్లో ఉన్న నాయకులతో సంప్రదింపులు జరుగుతున్నట్టు విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. బీజేపీ ఎలాగో ఇక్కడ స్ట్రాంగ్ అయ్యేందుకు రెడీ అవుతుంది. ఇప్పుడు జనసేన కూడా సిగ్నల్ ఇచ్చేశారు. దీంతో మరికొన్ని రోజుల్లో ఏపీలో విజయం సాధించిన కూటమిని తెలంగాణలో చూడబోతున్నామనే వాదన బలపడుతోంది.స్థానిక సంస్థల ఎన్నికల నాటికే తెలంగాణలోకి ఎంట్రీ ఇవ్వాలని చూస్తున్నారు. ఇవి చిన్న ఎన్నికలే అయినా పార్టీ బలోపేతానికి చాలా ఉపయోగపడతాయి. అందుకే ఆ ఎన్నికల్లో పోటీ చేయాలని బీజేపీ, టీడీపీ, జనసేన భావిస్తున్నట్టు సమాచారం. దీని బట్టి చూస్తే తెలంగాణలో మరికొన్ని నెలల్లో పొలిటికల్ హీట్ పెరగనుందని అర్థమవుతోంది. కూటమి రాకను ముందే గ్రహించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ విమర్శలు అందుకున్నాయి. ఆంధ్రా పాలకులు మళ్లీ తెలంగాణలోకి ఎంట్రీ ఇస్తున్నారని తిప్పి కొట్టాలని సెంటిమెంట్‌ను రాజేస్తున్నాయి. ఈ మధ్య పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్ చంద్రబాబుపై ఇలాంటి విమర్శలే చేశారు. రెండు రోజుల క్రితం కొత్తగా ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతి కూడా ఇలాంటి కామెంట్స్

# పెరిగిన హలీం ధరలు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17,**రంజాన్ మాసం వచ్చిందంటే చాలు.. హైదరాబాద్ లో ఎక్కడ చూసినా హలీం ఘుమఘుమలు ఆహా అనిపిస్తాయి. గల్లీ నుంచి మొదలు కొని పేరు మోసిన రెస్టారెంట్ల వరకు హలీం అమ్మకాలు జోరుగా కొనసాగిస్తాయి. హలీం పేరుకు ముస్లీం సంప్రదాయ వంటకం అయినప్పటికీ, హిందువులు, ముస్లీంలు, క్రిస్టియన్లు అనే తారతమ్యం లేకుండా అందరూ లొట్టేలేసుకుంటూ తినేస్తారు. హైదరాబాద్ బిర్యానీ ప్రపంచ వ్యాప్తంగా ఎలా పాపులర్ అయ్యిందో, అలాగే హైదరాబాద్ హలీం టేస్ట్ ఖండాంతరాలకు విస్తరించింది. రంజాన్ సందర్భంగా ఇక్కడి నుంచి ఇతర దేశాలకు హలీం ఎగుమతి అవుతుంది. ప్రతి సంవత్సరం హలీంతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది.గత ఏడాదితో పోల్చితే ఈ సారి హలీం ధరలు బాగా పెరిగాయి. చిన్న రెస్టారెంట్ల నుంచి పేరు మోసిన రెస్టారెంట్ల వరకు ధరలను పెంచాయి. కొన్ని రెస్టారెంట్లలో హలీం ధర రూ. 280గా ఉంటే.. మరికొన్ని రెస్టారెంట్లలో రూ. 340గా ఉంది. ఒక్కో రెస్టారెంట్ లో ధర ఒక్కోలా ఉంది. ముడిపదార్థాల ధరలు పెరగడం.. ముఖ్యంగా మటన్, మసాలా దినుసుల రేట్లు గతంతో పోల్చితే ఈసారి మరింత పెరిగినట్లు రెస్టారెంట్ల యజమానులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే హలీం రేట్లు పెంచినట్లు వెల్లడించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాదికి మసాలా దినుసుల రేట్లు 25 శాతం వరకు పెరిగాయంటున్నారు. మటన్ రేట్లు కూడా గత ఏడాది కంటే ఈసారి ఎక్కువ కావడంతోనే హలీం రేట్లు పెంచక తప్పలేదంటున్నారు రెస్టారెంట్ యజమానులు.ఇక రంజాన్ మాసంలో హలీంకు ఓ రేంజ్ లో డిమాండ్ ఉంటుంది. అన్ని ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్.. ముఖ్యంగా జొమాటో, స్విగ్గీ, ఉబర్ ఈట్స్ లో పెద్ద మొత్తంలో ఆర్డర్లు లభిస్తున్నాయి. అయినప్పటికీ హలీంకు ఆఫ్ లైన్ లోనే భారీగా డిమాండ్ ఉంటుంది. సాయంత్రం అయితే చాలు, రెస్టారెంట్ల ముందు హలీం ప్రియులు క్యూలు కడుతున్నారు. ఈ ఏడాది బర్డ్ ఫ్లూ భయం నేపథ్యంలో చాలా వరకు చికెన్ హరీస్ అమ్మకాలు తగ్గిపోయాయి. మటన్ హలీం తినేందుకే జనాలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.రంజాన్ హలీం తయారీ, విక్రయాల్లో హైదరాబాద్ పాత బస్తీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉండే ప్రజలు రంజాన్ మాసంలో పాత బస్తీకి వచ్చి మరీ హలీం తిని వెళ్తారు. ముఖ్యంగా పిస్తా హౌజ్, షాదాబ్ హోటల్, నయాగ్రా హోటల్, శాలిబండలోని షాగౌస్, బార్కాస్ సహా పలు రెస్టారెంట్లలో హలీం విక్రయాలు పెద్దమొత్తంలో కొనసాగుతున్నాయి. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది హలీం బిజినెస్ మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా.

# బెట్టింగ్ యాప్స్ వ్యతిరేక ప్రచారంలో సజ్జనార్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17,** బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న యూట్యూబర్ హర్షసాయిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న హర్షసాయి వీడియోను పోస్టు చేస్తూ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న కారణంగా యూట్యూబర్ హర్షసాయిపై కేసు నమోదు అయింది. సైబరాబాద్ పోలీసులు... హర్షసాయిపై కేసు నమోదు చేశారని టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ ద్వారా వెల్లడించారు. యూట్యూబర్ హర్ష సాయి బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్న విషయం తెలిసిందే. తాను ప్రమోట్ చేయకపోతే వేరేవాళ్లు చేస్తారని, ఎందుకు ఆ డబ్బు పోగొట్టుకోవడం...ఆ డబ్బును పేద ప్రజలకు పంచుతున్నానని హర్షసాయి ఇటీవల ఓ ఛానల్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈ వీడియోను పోస్టు చేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్.. హర్షసాయిపై మండిపడ్డారు.బెట్టింగ్ యాప్స్ కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్... యువత బెట్టింగ్‌ల బారిన పడకుండా ఉండాలని సూచిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమాదకరమని, ఈ యాప్స్ ను ప్రమోట్ చేస్తు?న్న సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ కు వ్యతిరేకంగా చసే నో టూ బెట్టింగ్ యాప్స్ క్యాంపెయిన్ స్టార్ చేశారు. ఎంతో మంది అమాయకులు బెట్టింగ్ భూతం వలలో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకున్నారని సజ్జనార్ గుర్తుచేశారు. తాను ఎవరిపై వ్యక్తిగతంగా పోరాటం చేయడం లేదన్నారు.యాప్ లతో ఎంతో మంది యువత జీవితాలను నాశనం చేసి కోట్లలో సంపాదించి.. వేలల్లో పంచుతూ సంఘసేవ చేస్తున్నట్లు పోజులు కొడుతున్న ఇలాంటి వాళ్లనా మీరు ఫాలో అవుతుంది. వీరి స్వార్థం వల్లే బెట్టింగ్ సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. భారత ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తోంది. అసలు ఏం ఉద్ధరించారు వీళ్లు. ఏమైనా దేశ సేవ చేస్తున్నారా? సమాజాహితం కోసం ఏమైనా మంచి పనులు చేస్తున్నారా? ఇప్పటికైనా ఇలాంటి సైబర్ టెర్రరిస్టులను అన్ ఫాలో కొట్టండి. వారి అకౌంట్ లను రిపోర్ట్ చేయండి. ఎవరైనా బెట్టింగ్ యాప్ ల వల్ల నష్టపోతే సమీపంలోని పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయండి" అని సజ్జనార్ ట్వీట్ చేశారు."యూట్యూబర్ హర్ష సాయిపై కేసు సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేను కొంత మంది వ్యక్తులను మాత్రమే వ్యతిరేకించడం లేదు. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తున్న సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల వ్యవస్థతో పోరాడుతున్నాను. వారికి లక్షలాది మంది అనుచరులు ఉన్నా లేదా కొన్ని వేల మంది ఉన్నా, ఈ విధ్వంసక ప్లాట్‌ఫామ్‌లను ప్రమోట్ చేసే ఎవరైనా ప్రజలను తప్పుదారి పట్టించడమే కాకుండా వారి జీవితాలను నాశనం చేస్తున్నారు.వీటి వల్ల నిజమైన ప్రమాదం ఆర్థిక నష్టానికి మించి ఉంది. ఇది మన దేశ భవిష్యత్తును క్రమంగా క్షీణింపజేస్తోంది. భారతీయ ప్రతిభ ప్రపంచ సంస్థలకు నాయకత్వం వహిస్తుండగా, చాలా మంది యువ జీవితాలు వారి సొంత దేశస్థుల చేతుల్లో చిక్కుకుపోయి పట్టాలు తప్పుతున్నాయి. ఈ యాప్‌లు కేవలం వ్యక్తిగత ప్రమాదం కాదు, అవి సామాజిక, ఆర్థిక ముప్పు, కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయి. ఇక ఆలస్యం కాకముందే, అవి కలిగించే నష్టాన్ని గుర్తించండి"– వీసీ సజ్జనార్

# లోకల్ బాడీ ఎన్నికల కోసం కమలం ప్లాన్

**హైదరాబాద్, ప్రజాబలం ప్రతినిధి మార్చి 17,** భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. త్వరలో జరిగే ఈ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కానుంది. మొన్న జరిగిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడంతో రెట్టింపు ఉత్సహంతో ముందుకు సాగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధిస్తే వచ్చే సాధారణ ఎన్నికల వరకు పార్టీ మరింత బలోపేతమవుతుందని అధిష్టానం భావిస్తుంది. పట్టు ఉన్న ప్రాంతాల్లో మరింత ఫోకస్ పెట్టి భారీ విజయాలు సాధించాలని ప్లాన్ చేస్తుంది. అందులో భాగంగానే ఇప్పటి నుంచే వివిధ సమావేశాలతో పార్టీ నేతలు బిజీ బిజీ అవుతున్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే బీజేపీ బలంగా ఉంది. ఇక్కడ ప్రతి ఎన్నికల్లో.. ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచుకుంటు వస్తుంది.. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు గెలవకున్నా.. ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. ఇటు టీచర్స్ తో పాటు పట్టభద్రుల ఎన్నికల్లో భారీ విజయం సాధించింది. ఉత్తర తెలంగాణపై ప్రభావం ఉండే ఈ ఎన్నికల్లో బీజేపీ గెలవడంతో.. పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. ఇదే ఉత్సాహంతో.. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం సాధించాలని.. అధిష్టానం ప్లాన్ చేస్తుంది. రిజర్వేషన్ తో సంబంధం లేకుండా.. ప్రతిచోట పార్టీని బలోపేతం చేసి.. విజయం సాధించే విధంగా క్యాడర్ ను సమాయత్తం చేస్తుంది. అందులో భాగంగానే.. ప్రతి మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తుంది.అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నేతలకు.. బాధ్యతలు అప్పగిస్తున్నారు. అయితే.. అవసరం ఉన్న చోట? చేరికలను ప్రోత్సహించాలని నేతలు చెబుతున్నారు. ఇప్పటికే.. గ్రామ స్థాయిలో.. పార్టీ బలహీనంగా ఉంది. ఆలాంటి ప్రాంతాల్లో.. ఇతర పార్టీలకు చెందిన నేతలను చెర్పించుకునే విధంగా ప్లాన్ చేస్తున్నారు. అన్ని స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పట్టు ఉన్న ప్రాంతాల్లో మరింత పట్టు సాధించాలని వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. అదే విధంగా స్థానిక సమస్యలను ఫోకస్ పెట్టి.. ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ తరుచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మెజారిటీ స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నారు.ఇప్పటి నుంచే బీజేపీ కీలక నేతలు బూత్ వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి బూతులో 51 శాతం ఓట్లు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఎన్నికల గురించి ఆలోచించకుండా.. రేపే ఎన్నికలు ఉన్నట్లు పని చేయాలని క్యాడర్ కి నేతలు పిలుపునిస్తున్నారు.. అదే విధంగా అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన నేత వారంలో ఒక్కసారి.. కార్యకర్తల సమావేశంలో పాల్గొనాలి. ముఖ్యంగా గ్రామ స్థాయిలో ఎక్కువ పర్యటనలు ఉండే విధంగా ప్లాన్ చేశారు. ముందుగా.. సర్పంచ్ ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో.. గ్రామాల్లో బలమైన నేతలను గుర్తించే పనిలో ఉన్నారు. పార్టీ సింబల్ లేనప్పటికీ.. పార్టీ సానుభూతిపరులు అధికంగా గెలిచేందుకు పని చేయాలని కోరుతున్నారు. మొత్తానికి.. బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కోసం అన్ని సిద్ధం చేసుకొని.. ప్రజా క్షేత్రంలోకి దిగేందుకు సై అంటుంది.

## నల్గొండ జిల్లా మంగళపల్లి పశు వైద్య శాలలో దారుణం

## పశువుల వైద్యంకు ఎక్సపైరీ డేట్ దాటిన మందుల సరఫరా

నల్గొండ ప్రాణం ఎవరిదైనా దాని విలువ ఒక్కటే!వైద్యం విషయంలో మనుషులకు ఒక రూల్, మాట్లాడలేని మూగ జీవాలకు మరో రూల్ అంటూ ఏమి ఉండదు.!నల్గొండ జిల్లాలో పాడి పశువుల వైద్యం కొరకు సిబ్బంది ఇస్తున్న మందులు ఎక్సపైరీ డేట్ దాటిపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం మూగ జీవాల పాలిట శాపంగా మారుతుంది. నకిరేకల్ (మం) మంగళ పల్లి పశువైద్య శాలలో డేట్ దాటిన మెడిసిన్ సరఫరా రాష్ట్రంలోని పశు వైద్యాశాలల పని తీరును తేట తెల్లం చేస్తుంది.జిల్లా కలెక్టర్ స్పందించి మూగ జీవాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు. జిల్లాలో ఉన్న పశు వైద్య శాలల్లో తనిఖీ నిర్వహించి డేట్ దాటిన మందులు తొలగించి, పశు వైద్యం మెరుగు పర్చాలని డిమాండ్ వ్యక్తం అవుతుంది.

# డ్రై పోర్టును సిద్ధం చేస్తున్న సర్కార్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 17,** తెలంగాణలో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే, డ్రైపోర్టు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయి. వికసిత్ భారత్ ప్రణాళికల్లో భాగంగా వీటిని నిర్మించనున్నారు. మనోహరాబాద్ ప్రాంతంలో డ్రైపోర్టు, హైదరాబాద్–బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. త్వరలోనే ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కనుండగా.. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి.తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పెషల్ ఫోకస్ పెట్టాయి. రాష్ట్ర అభివృద్ధిలో రహదారులదే కీలక పాత్ర కాబట్టి.. వాటి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే ఉన్న రోడ్లను విస్తరించటంతో పాటుగా.. కొత్త రహదారుల నిర్మాణానికి ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ఇక భారత్‌ను సుసంపన్న దేశంగా నిలబెట్టడంలో డ్రైపోర్ట్‌లు, వాటి ట్రాన్స్‌పోర్టుకు రోడ్లు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా.. వికసిత్ భారత్–47 ప్రణాళికలను రాష్ట్రంలో అమలు చేస్తోంది.ఈ మేరకు హైదరాబాద్ సమీపంలో మనోహరాబాద్ వద్ద ఒక డ్రైపోర్ట్ నిర్మించాలని రాష్ట్రం డిసైడ్ అయింది. కేంద్రానికి రేవంత్ సర్కార్ ఇటీవల ప్రతిపాదనలు కూడా పంపించింది. అదే సమయంలో హైదరాబాద్ నగరం నుంచి ఏపీలోని బందర్‌పోర్ట్ వరకు కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటుకు సిద్ధమైంది. ఈ ప్రతిపాదనను సైతం కేంద్రం ముందుంచింది. కేంద్రం నుంచి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేకు అనుమతి లభిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కొంత మె?త్తం ఖర్చు చేయాల్సి ఉంటుంది. వివిధ అవసరాల నిమిత్తం రూ.17 వేల కోట్లను అందించాల్సి రావొచ్చని కేంద్రం సూచనప్రాయంగా వెల్లడించింది.

# షెడ్యూల్డ్ కులాల వారు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 17:** జిల్లాలోని శాఖల వారీగా రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో ఎస్సీలకు ఎంత శాతం లబ్ది చేకకూరుతుందనే జాబితాలను మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పరిశీలించారు. సోమవారం కలెక్టరేట్ విసి హాల్ లో షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాకు మంగళవారం రానున్న సందర్భంగా జిల్లా అధికారులతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో ఎస్సీలకు ఎంత శాతం లబ్ది చేకూరుతుందని శాఖల వారీగా కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీలకు ఎంత శాతం లబ్దిచేకూరుతుందనే జాబితాలను కలెక్టరు పరిశీలించారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అందించే రైతు భరోసా,రైతు బీమా,రుణ మాఫీ, గృహాలక్ష్మి, స్వయం సహాయక బృందాల రుణాలు, మహిళా శక్తి, 2 బిహెచ్ కె వంటి పథకాల అమలు లో ఎంత మంది ఎస్సీలకు లబ్ది చేకూరిందని జిల్లా కలెక్టరు సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సలహాలను, సూచనలను అధికారులకు కలెక్టరు తెలిపారు. జిల్లా జనాభాలో ఎస్సీలు ఎంత శాతం ఉన్నారు అని సిపిఓ ను అడిగారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, సిపిఒ శేఖర్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, విద్యాశాఖాధికారి విజయ కుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, హౌజింగ్ఈఈ రమణమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ఈడి బాబు మోసెస్, పరిశ్రమలు అధికారి ప్రశాంత్, సివిల్ సప్లై, అధికారి సుగుణబాయి, మెడికల్ అండ్ హెల్త్ అధికారి ఉమాగౌరి, విద్యుత్తు శాఖాధికారి, జిల్లా ఉపాధి అధికారి రాధిక తదితర శాఖల అధికారులు పాల్గొనారు.

# కలెక్టరేట్ లో ప్రజావాణి

# పిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ గౌతమ్



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 17:** కలెక్టరేట్ ప్రజావాణిలో లోనే కాకుండా మున్సిపాలిటి, మండల స్థాయి కార్యాలయాలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం జిల్లా అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (73) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రజావాణిలోనే కాకుండా మున్సిపాలిటి, మండల స్థాయి కార్యాలయాలలో వచ్చే దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. జిల్లా అధికారులు జాప్యం లేకుండా దరఖాస్తులను పరిష్కరించి దరఖాస్తుదారునికి సమాచారం తెలియపరచాలని జిల్లా అధికారులను కలెక్టరు ఆదేశించారు.

వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ ఆవరణలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీల వినూత్న నిరసన

హైదరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సోమవారం మండలి ఆవరణలో మిర్చి దండలు వేసుకొని నిరసన తెలిపారు. మిర్చి రైతుల సమస్యలు పరిష్కరించాలని 25వేల గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు.తెలంగాణ రాష్ట్రం లో గత సీజన్లో 4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు అయింది.. ధర లేక ఈ సీజన్లో 2లక్షల 40 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గిపోతోంది అని ఆందోళన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి నాఫెడ్, మార్క్ ఫెడ్ ద్వారా మిర్చి మద్దతు ధర క్వింటాల్ కు ఇరవై ఐదు వేల రూపాయలు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలి. తెలంగాణ మిర్చి పంటలు విదేశీ ఎగుమతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తెలంగాణ మిర్చి పంటను సుగంధ ద్రవ్యాల బోర్డు నుంచి ఆహార పంటల జాబితాలో చేర్చాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేసారు.

## రంగారెడ్డి జిల్లా రైతుల త్యాగమే పరిశ్రమలు రాక

## నూతన వ్యవసాయ పద్దతులను కర్షకలోకానికి పరిచయం చేయాలి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణస్వీకారంలో రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి, ఐటీ శాఖా మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీపై బీఆర్ఎస్, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయి. మార్కెట్ కమిటీలో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇచ్చాం. రైతులకు ఒకేదఫాలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తే కళ్లులేని కబోదిల్లా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం ఆధారిత కొత్త పరిశ్రమలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి చెప్పారు. కొత్త పరిశ్రమలకు రంగారెడ్డి జిల్లా అన్నదాతల భూముల త్యాగమే ఇక్కడి అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.... వ్యవసాయ మార్కెట్ కమిటీలో అన్ని వర్గాలకు, కులాలకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని కేఎల్ఆర్ చెప్పారు.
రంగారెడ్డి జిల్లా రైతుల త్యాగమే నేటి యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు అన్నారు. కొత్తకమిటీ కర్షకలోకానికి మంచి చేయాలని, అవగాహన పెంచాలని రైతుబిడ్డ లక్ష్మారెడ్డి చెప్పారు.అంతకు ముందు తుక్కుగూడలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ కు ఘన స్వాగతం లభించింది. మహేశ్వరం పట్టణంలో స్వాగతతోరణం, కాంగ్రెస్ జెండాలు, వాహనశ్రేణితో భారీ స్వాగతం పలికారు.

## సంకష్టహర చతుర్థి పూజలందుకున్న మహాగణపతి

## –అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

మంథని సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. సంకష్ట చతుర్థి నాడు వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విఘ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయం లోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ఈ నెల 20న సూర్యాపేటలో, 23న కరీంనగర్‌లో ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు**

**అసెంబ్లీ సమావేశాల అనంతరం వరుసగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటన**

**బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సంబరాల విజయానికి దిశానిర్దేశం**



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనల్లో భాగంగా, జిల్లా కేంద్రాల్లో ముఖ్యమైన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలు ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. అందులో భాగంగా వరంగల్‌లో లక్షలాదిమంది పాల్గొన్న భారీ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించనునట్లు పార్టీ ప్రకటించింది.

పార్టీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాల్లో భాగంగా అనేక కార్యక్రమాలు, సంబరాలను నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందించబడింది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వేటిని అమలు చేయకుండా వంచిస్తున్న తీరు పైన కూడా చేపట్టాల్సిన కార్యాచరణ పైన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు స్వయంగా జిల్లా నేతలకు, కార్యకర్తలకు మార్గదర్శనం చేయనున్నారు.

ఈ నేపథ్యంలో, ఈ నెల 20వ తేదీన సూర్యాపేట జిల్లా కార్యకర్తలతో, 23న కరీంనగర్ జిల్లా నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు.

14 ఏళ్ల ఉద్యమం ప్రస్థానంతోపాటు, పదేళ్ల ప్రగతి ప్రస్థానంలో తెలంగాణ సమాజంతో బీఆర్ఎస్ పార్టీ పెనువేసుకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సమావేశాల సందర్భంగా మరోసారి గుర్తుచేసుకోనున్నారు.

పార్టీకి ఎన్నిరకాల ఒడిదుడుకులు ఎదురైనా గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుని నిలబడ్డ పార్టీ శ్రేణులకు రానున్న రోజుల్లో మళ్లీ ఉజ్వల భవిష్యత్తు ఉండబోతున్న విషయాన్ని కేటీఆర్ తెలియజేయనున్నారు. ఏడాదిన్నరలోనే తీవ్రమైన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని, తెలంగాణ ప్రజల భరోసా ఇప్పుడు బీఆర్ఎస్ పైన, కేసీఆర్ గారి పైనే ఉన్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత క్రియాశీలకంగా పనిచేయాలని దిశానిర్దేశం చేయబోతున్నారు. కేటీఆర్ పర్యటనల వలన పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నిండనున్నది.

# పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

**అర్హులైన పేద వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

**దళారులను నమ్మి లబ్ధిదారులు మోసపోవద్దు**

**ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

పెగడపల్లి (ధర్మపురి) :ధవాఖానాలలో చికిత్సలు చేయించుకున్న పేద వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని, ప్రభుత్వ పరంగా పేద ప్రజలను ఆదుకుని ఆర్థికంగా చేయూతను ఇచ్చేందుకే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్నామని, అర్హులైన పేదవారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని 28 లక్షల 88 వేల 5 వందల రూపాయల విలువ గల 88 సిఎంఆర్ఎఫ్ చెక్కులను అర్హులైన 88 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సంధర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..

గత ప్రభుత్వ పాలకులు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి అప్పుల రాష్ట్రంగా మాకు అప్పగించడం జరిగిందని, ఉన్న అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని, వ్యవసాయ భూమిని సాగు చేసుకున్న రైతుకు భరోసా ఇచ్చే విధంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందని, రైతులకు ఇప్పటికే 2 లక్షల రూపాయల వరకు రుణాలను మాఫీ చేయడం జరిగిందని, ఏదైనా సాంకేతిక సమస్య వల్ల రుణమాఫీ కాని వారి రుణాలను మాఫీ చేస్తామని, గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించామని, మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల ద్వారా అద్దె బస్సులను ఆర్టీసీలోకి తీసుకుంటున్నామని, నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పిస్తున్నామని, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును, 500 రూపాయలకే సిలిండర్ ను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ధర్మపురి ఎమ్మెల్యేగా నన్ను గెలిపించి, ఐదు సంవత్సరాల పాటు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రజాసేవకై నిత్యం ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉంటున్నానని, సమస్యలు ఉన్నవారు నేరుగా నన్ను కలవవచ్చని, ఫోన్ కాల్ ద్వారా, ఎస్ఎంఎస్ ద్వారా సమస్యలను తెలియజేస్తే వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవీందర్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, ఉపాధ్యక్షులు సంధి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి చాట్ల భాస్కర్, మండల నాయకులు కడారి తిరుపతి, అమిరిశెట్టి మల్లారెడ్డి, ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి, చెట్ల కిషన్, తడగొండ తిరుపతి, ధనాల సురేష్, లచ్చగౌడ్, సుధీర్, పవన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాంరెడ్డి, సత్తిరెడ్డి, ప్రవీణ్, ప్రశాంత్, పెద్ద సత్యం, మల్లేశం, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్ షిప్ లను 2022లో కేంద్రం నిలిపివేసింది రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడింది : మంత్రి సీతక్క



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 17 :** పిల్లలకు పౌష్టికాహారం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి సీతక్క తెలిపారు. విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆమె శాసన సభలో మాట్లాడుతూ.. విద్యార్థుల కాస్మోటిక్ ఛార్జీలు కూడా 212 శాతం పెంచామని చెప్పారు. కల్తీ ఆహారం వంటి ఘటనలపై వెంటనే చర్యలు తీసుకున్నామని తెలియజేశారు. మహిళా ఐఎఎస్ అధికారులు నైట్ హాల్ట్ చేయాలని చెప్పామని, వివిధ హోదాల్లోని రాజకీయ నాయకులు కూడా నైట్ హాల్ట్ చేస్తున్నారని వెల్లడించారు. ఎనిమిదో తరగతి వరకు అందించే స్కాలర్ షిప్ లను 2022లో కేంద్రం నిలిపివేసిందని మండిపడ్డారు. కేంద్రం డైట్ ఛార్జీలు, స్కాలర్ షిప్ ల నిలిపివేతతో రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడిందని

# అసెంబ్లీని ముట్టడించిన బీఆర్ఎస్వీ శ్రేణులు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**సోమవారం నాడు రాష్ట్ర బీఆర్ ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఇతర శ్రేణులు అసెంబ్లీ ని ముట్టడించారు. అసెంబ్లీ గేటు లో పలికి దూసుకెళ్లే ప్రయత్నం చేసారు. వారిని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసారు. సీఎం రేవంత్ రెడ్డి డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేసారు. ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ఇచ్చిన సర్క్యులర్ రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. సామజిక ప్రజా ఉద్యమాలకు వేదికయినా ఓయూ లో విద్యార్థులు నిరసన కార్యక్రమాలు రద్దు అనటం అన్యాయం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి దొడ్డి దారిన రావచ్చు కానీ ఓయూ విద్యార్థులు విద్య ,నిరుద్యోగ సమస్యల మీద ప్రశ్నిస్తే తప్పు అని ప్రశ్నించారు.

# ఓయూ లో ఉద్రిక్త వాతావరణం

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**సోమవారం ఉదయం ఓయూలో ఉద్రిక్తత నెలకొంది. ఓయూ లో నిరసనలు, ఆందోళనలు నిషేధిస్తూ ఉత్తర్వుల పై సర్కులర్ జారీ చేయడంపై విద్యార్థులు మండిపడ్డారు. ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని అన్ని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేసాయి. ఓయూ విసీ కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఐక్య విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి. ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థుల సంఘాలు నిరసనకు దిగాయి. నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో లకు తరలించారు.

# గురుకులాల్లో గీజర్లు ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, సోలార్ పవర్ ఆధారిత గీజర్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే, ప్రభు?త్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల సౌకర్యాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు వేకువజామున లేచి చన్నీళ్లతో స్నానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందుకే అన్నీ హాస్టళ్లలో గీజర్లను అందుబాటులోకి తేవాలని అన్నారు.

# గురుకులాల్లో గీజర్లు ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, సోలార్ పవర్ ఆధారిత గీజర్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే, ప్రభు?త్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల సౌకర్యాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు వేకువజామున లేచి చన్నీళ్లతో స్నానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందుకే అన్నీ హాస్టళ్లలో గీజర్లను అందుబాటులోకి తేవాలని అన్నారు.

## 8వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

బైంసా పట్టణంలో విద్యార్థిని ఆత్మహత్య కలకలం రేపింది. స్థానిక పూలే నగర్ కాలనీకి చెందిన కదం కోమల్ అనే 8వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో కోమల్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాలనీకి చెందిన ఓ యువకుడి వేధింపులే ఆత్మహత్యకు కారణమని తల్లిదండ్రులు ఆరోపణ. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇది గాంధీ భవన్ కాదు..అసెంబ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తి న అక్బరుద్దీన్ ఓవైసీ



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**మార్చి 17 ఇది గాంధీ భవన్ కాదు.. అసెంబ్లీ అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సభ నిర్వహణపై ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా.. అధికార పక్షానికే ఎక్కువ సమయం కేటాయించడాన్ని ఓవైసీ తప్పుబట్టారు.అసెంబ్లీలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. సభలో మాట్లాడుదామంటే మైక్ ఇవ్వరు. అధికార పక్షం ఇలా చేయడం మంచిది కాదు. శాసనసభను నడపడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదు. ప్రశ్నలు కూడా మార్చుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం. అసెంబ్లీని అసెంబ్లీలా నడపండి.. గాంధీ భవన్‌లా కాదు అని ఎమ్మెల్యే ఓవైసీ సూచించారు.

# మంత్రి లోకేష్ కు రుణపడి ఉంటాం..




శ్రీ అవధూత కాశి నాయన మండలంలోని జ్యోతి క్షేత్రంలో ఫారెస్ట్ అధికారులు ఇటీవల పలు భవనాలను కూల్చివేసిన విషయం తెలిసిందే.. ఈ విషయంపై నారా లోకేష్ స్పందించి ఆయన తరపున ఖాదీడ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరిని జ్యోతి క్షేత్రానికి పంపించి పునర్నిర్మాణ పనులు పూర్తి అయ్యేవరకు అక్కడే ఉండాలని ఆదేశాలు ఇచ్చారు.. అప్పటినుండి పనులు పూర్తయ్యే వరకు ఆయన పర్యవేక్షిస్తున్నారు.. దీంతో స్థానిక టిడిపి నాయకులు పునర్నిర్మాణ పనులు పూర్తయిన భవనం వద్ద థాంక్యూ లోకేష్ సార్ అనే పోస్టర్లను విడుదల చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్షలాదిమంది జ్యోతి క్షేత్ర భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా స్పందించిన వెంటనే కూల్చివేతలను పునర్నిర్మించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నారా లోకేష్ నిలిచిపోయారన్నారు.. కూటమి ప్రభుత్వం మాట చెప్పిందంటే పూర్తి చేసే వరకు నిద్రపోమన్నారు.. మంత్రి నారా లోకేష్ కు కాశిరెడ్డి నాయన భక్తులు ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలోఖాదీడ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి,టిడిపి నాయకులు రాజా రెడ్డి, రవీంద్రారెడ్డి, గురివిరెడ్డి, బిజీ వేముల రాజశేఖర్ రెడ్డి, నరసింహారెడ్డి,రమణారెడ్డి, కృష్ణారెడ్డి, పోలిరెడ్డి, కల్వకురి రమణ, రోహిత్ రెడ్డి,గురువయ్య, విజయ్ కుమార్ రెడ్డి,సుధాకర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు..

## గోడలు దూకడం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు అలవాటు మంత్రి కొండా సురేఖ ద్వజమ్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 17** గోడలు దూకడం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు అలవాటని, ఆ అలవాట్లే అందరికీ ఉంటాయనుకుంటున్నారని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ట్యాపింగ్, స్టింగ్ ఆపరేషన్లు చేయడం మీకు అలవాటే కదా అని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పై స్టింగ్ ఆపరేషన్ చేశారా? అని ప్రశ్నించారు. కెబినెట్ విస్తరణ ఇప్పట్లో ఉంటుందనుకోవడం లేదని చెప్పారు. తిరుపతిలో తెలంగాణ మంత్రుల లెటర్లు అనుమతించాలని?త్వరలో ఎపి సిఎం చంద్రబాబు నాయుడును కలిసి కోరతానని తెలిపారు.బిజెపి సభ్యులు వివాదాలు సృష్టించాలని చూస్తున్నారని వెల్లడించారు. తెలంగాణను వ్యతిరేకించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని, కేంద్ర సంస్థలకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుంటే మాకు అభ్యంతరం లేదని తెలియజేశారు. దేవదాయ శాఖ పరిధిలోని భూములను రక్షిస్తామని, అన్యాక్రాంతం కాకుండా మహిళలకు లీజ్ కు ఇస్తామని పేర్కొన్నారు. అన్ని దేవాలయాలను ఒకే గొడుగు కిందకు తెస్తామని, ప్రతి ఆలయ ఖర్చులు థర్డ్ పార్టీతో ఆడిట్ చేపిస్తామని కొండా సురేఖ స్పష్టం చేశారు.

# కార్మికుడికి రావలసిన గ్రాడ్యుయేట్ ఇప్పించిన

## –బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్



**కూకట్పల్లి (ప్రజబలం)మార్చ్ 17:** కూకట్ పల్లి నియోజకవర్గం ప్రశాంత్ నగర్ ఇండస్ట్రీ ఏరియాలో క్వాలిటీ ఇంజనీరింగ్ కంపెనీ లో బాబర్ సింగ్ యాదవ్ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పనిచేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల క్వాలిటీ ఇంజనీరింగ్ కంపెనీలో మానేయడం జరిగింది. బాబర్ సింగ్ యాదవ్ అనే కార్మికుడికి గ్రాడ్యుయేట్ 50,000/- వేల రూపాయలు రావాల్సి ఉండగా అవి ఇవ్వకపో వడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగి అడిగి విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన కార్మికుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి బాబర్ సింగ్ యాదవ్ కు రావలసిన గ్రాడ్యుయేట్ 50,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది.కార్మికుడు బాబర్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్ ,జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ లైబ్రరీ ఆధునికరణకు రూ. 15 లక్షల నిధులు మంజూరు.



**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి** బార అసోసియేషన్ డిజిటల్ లైబ్రరీ ఆధునికరణకు, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ 15 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్టు కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పి వి రాజ్ కుమార్, బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ ఆధునికరంలో భాగంగా కంప్యూటర్లు తదితర కొనుగోలు నిమిత్తం ఎంపీ నిధులను నుండి బండి సంజయ్ 15 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ కి బార్ అసోసియేషన్ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు టి.రఘువీర్, జాయింట్ సెక్రెటరీ భీమా సాహెబ్, కోశాధికారి రామగిరి శ్రీనివాస్, లైబ్రరీ సెక్రటరీ కటకం రాజేందర్, మడిపెల్లి రవి, డి.రేణుక, సుంకే దేవకిషన్, మాతంగి రవీందర్, బెజ్జంకి శ్రీకాంత్, కొండ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చత్రపతి, శివాజీ మహారాజ్ 398 వ జన్మదిన దినోత్సవం




**ముషీరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**సోమవారంనాడు చత్రపతి, శివాజీ మహారాజ్ 398 వ జన్మదిన దినోత్సవం తిథి ప్రకారం ఘనంగా నిర్వహించడం జరిగింది

నారాయణ గూడా శివాజీ మహారాజ్ విగ్రహం దగ్గర హిందూ సామ్రాజ్య దినోత్సవం

హిందూ సామ్రాజ్య దినోత్సవం,ప్రతి సంవత్సరం ఛత్రపతి శివాజీ పట్టాభిషేక వార్షికోత్సవం జరిగిన సందర్భంగా జరుపుకుంటారు. ఛత్రపతి శివాజీహిందూ ధర్మాన్ని, హిందూ సంస్కృతిని, హిందూ సమాజాన్ని సంరక్షించిన వారిలో అగ్రగణ్యుడుగా పేరుగాంచిన వీరుడు. 1674 జూన్ 6న (జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి) రాయఘడ్ కోటలో వేద పఠనాల మధ్య శివాజీని క్షత్రియరాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ 'ఛత్రపతి' అని బిరుదును ప్రదానం చేసారు. శివాజీ 1630 ఫిబ్రవరి 19 వైశాఖ శుక్ల పక్ష తదియనాడు పూణే జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర శివనేరి కోటలో శహజీ భోస్లే, జిజాభాయి దంపతులకు జన్మించాడు.

ఏ సుదర్శన్ శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షులు అవినాష్ కుమార్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహేష్ కుమార్ శివసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గౌటి గణేష్ శివసేన గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కరణ్ సూర్య వంశీ తదితరులు పాల్గొన్నారు ఈ శివాజీ మహారాజ్ కార్యక్రమం శివసేన గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగింది

# అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదం..
# తెలంగాణకు చెందిన ముగ్గురు దుర్మరణం

న్యూ డిల్లీ మార్చి 17 అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన ఫ్లోరిడాలో చోటు చేసుకుంది. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం టేకులపల్లికి చెందిన ముగ్గురు మృత్యువాతపడ్డారు. వివరాల్లోకి వెళితే.. టేకులపల్లికి చెందిన మాజీ ఎంపిటిసి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ పవిత్రదేవిలకు ఇద్దరు కుమార్తెలు. వారిలో రెండో కుమార్తె ప్రగతి రెడ్డిని సిద్ధిపేట సమీపంలో ఉన్న బక్రి చప్రియాల్‌కు చెందిన రోహిత్ రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. రోహిత్ తల్లి సునీత కూడా వారితోపాటే అమెరికాలో ఉంటుంది. అయితే ఇద్దరు పిల్లలు, రోహిత్, ప్రగతి, సునీత కారులో వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రగతి(35), అర్విన్(6), సునీత(56) అక్కడికక్కడే మృతి చెందగా.. రోహిత్, చిన్నకుమారుడికి గాయలయ్యాయి. వీరి మృతితో టేకులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఇల్లందకుంటలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవము



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి** మార్చి 17 తేదీ 17.03.2025 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లందకుంట పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. జయప్రకాష్ మాట్లాడుతూ పిఎం శ్రీ పాఠశాలగా ఇల్లంతకుంట పాఠశాల ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉందని ఇది రెండవ సంవత్సరంగా పీఎం శ్రీ కొనసాగుతుంది పీఎం శ్రీ పాఠశాలలో భాగంగా పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులచే ఎక్స్పోజర్ విసిట్ లో భాగంగా రామప్ప వేయి స్తంభాల గుడి వరంగల్ కిల రీజినల్ సైన్స్ సెంటర్ కాకతీయ జూపార్క్ సందర్శించడం జరిగింది, ఫీల్డ్ ట్రిప్ లో భాగంగా జమ్మికుంట లోని ప్రకాశం కృషి విజ్ఞాన్ వ్యవసాయ కేంద్రం వావిలాల లోని ఖాదీ గ్రామోద్యోగు కాదిబండార్ చూపించడం జరిగిందని అలాగే పాఠశాలలో అటల్ టింకరింగ్ సైన్స్ ల్యాబ్ గత సంవత్సరం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సంవత్సరం సైన్స్ ల్యాబ్ 13 లక్షల వ్యయంతో నిర్మించడం జరుగుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే 10 కంప్యూటర్లు మరియు 25 ట్యాబులను ఇవ్వడం జరిగిందని పిల్లలకి నాణ్యమైనటువంటి బోధన అందిస్తున్నట్లు ఉపాధ్యాయులచే ప్రతి సబ్జెక్టు టీచర్ విద్యార్థులకు బోధన చేస్తున్నారని గత సంవత్సరం మా పాఠశాలలో 9.5 జిపిఏ ప్రథమ స్థానంగా నిలిచిందని అలాగే ఈ సంవత్సరం కూడా ఇల్లందకుంట మండలంలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల విద్యాధికారి కె.రాములు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఇల్లంతకుంట పాఠశాల విద్యార్థులలో అత్యధిక విద్యార్థులచే కొనసాగుతుందని అలాగే విద్యాసామర్ధ్యాలతో ప్రథమ స్థానంలో ఉందని అనుభవజ్ఞులో అయినటువంటి ఉపాధ్యాయులచే విద్యాబోధన కొనసాగుతూ చాలా చక్కగా ఈరోజు పాఠశాల వార్షికోత్సవం నిర్వహించడం జరిగిందని అభినందించారు.అలాగే ఈ పాఠశాలలో మంజూరైనటువంటి పీఎం శ్రీ లో భాగంగా సైన్స్ ల్యాబ్ మరియు కంప్యూటర్ ల్యాబ్ ఎక్స్పోజర్ విజిట్ ,ఫీల్డ్ ట్రిప్ వీటన్నింటినీ సందర్శించడం జరిగిందని విద్యార్థుల్లో ఒక నూతన ఒరవడిని, ఉత్తేజాన్ని నింపడం కొరకు ఇల్లందకుంట పాఠశాల పాల్పడుతుందని, అలాగే గత సంవత్సరం 100% ఉత్తీర్ణతతో 9.5 జిపిఏ సాధించిందని ఈ సంవత్సరం కూడా అత్యధిక మార్కులతో 100% ఉత్తీర్ణతతో కొనసాగాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్, మండల విద్యాధికారికె.రాములు, పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్. వేణు,శంకర్,కే సత్యనారాయణ, జి.అన్నపూర్ణ, రాధికారానీ, కౌసల్య,సురేష్,మనోహర్ రెడ్డి, రామకృష్ణ,సుధాకర్, లక్ష్మణాచారి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి:
## డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు




**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు గారు అన్నారు. మామడ మండలం కమల్ కోట్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విజయ్ కుమార్ రెడ్డి, నరేష్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాగులు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత మరొకరికి సహాయం అందించాలని కోరారు. విజయ్ కుమార్ గారు ఎటువంటి లాభాపేక్ష లేకుండా పెద్ద మనసుతో ముందుకు వచ్చి విద్యార్థులకు సహాయం అందచేయడం ఆనందంగా ఉందన్నారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచి లక్ష్యాలను పెట్టుకొని కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. పాఠశాలలో అదనపు గదులు వంటగది నిర్మాణానికి నిధులు కేటాయించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,డీసీసీ అధ్యక్షులకు వినతి పత్రం అందజేశారు. సంబంధిత మంత్రితో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భుజంగా శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ జైసింగ్,ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్,కర్ణాకర్ రెడ్డి,మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగు లింగారెడ్డి,మాజీ ఎంపీపీ వకీల్,పాడాల శ్రీనివాస్ కాళగిరి గంగారెడ్డి,కాళగిరి నరేష్ రెడ్డి,నల్ల లింగ రెడ్డి,భోజన్న,అన్వర్,సల్కం శేఖర్,మంగు లింగన్న,రఫీ,ఉమేష్ రెడ్డి ,సిరాజ్,తదితరులు పాల్గొన్నారు

# ఆశ వర్కర్ల ధర్నా



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మార్చి 17** జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో ఆశా వర్కర్లు ధర్నా ధర్నా చేశారు. ఆశాలకు 18 వేల రూపాయలు ఫిక్స్ వేతనం ఇవ్వాలని పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కు సిఐటియు జిల్లా జైంట్ సెక్రెటరీ కొప్పుల శంకర్ హాజరై మాట్లాడుతూ 19 సంవత్సరాల నుంచి ఫిక్స్ వేతనం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆశలతో వెట్టిచాకిరి చేయించుకుంటుంది. ఏ ఎన్ సి, గౌట్ డెలివరీ టార్గెట్లు పెట్టి మానసికంగా ఆశలను హింసిస్తున్నారు. ఉద్యోగ భద్రత లేదు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేదు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ అధికారంలోకి వస్తే ఆశలకు పిక్స్ వేతనం ఇస్తామని అన్నారు 50 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని. 50,000 మట్టి ఖర్చులకు ఇవ్వాలని. ఏఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశలకు ఏఎన్ఎం ప్రమోషన్ ఇవ్వాలని, ఇంకా తదితర డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కొలుగూరి సుజాత, ప్రధాన కార్యదర్శి పర్లపల్లి కవిత, ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, నేదూరి రమ కళావతి, కోమల, యాదక్క మండలంలోని అన్ని గ్రామాల ఆశలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు.





**ప్రజాబలం ప్రతినిధి తేది.17.3.2025.** ములుగు జిల్లా.ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు 19 పిర్యాదులు సమర్పించారని, వాటిలో ధరణి కి సంబంధించిన భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ ఉపాధి, ఆసరా పెన్షన్లు, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యల పై దరఖాస్తులు సమర్పించారని తెలిపారు.

ప్రజావాణి ద్వారా వచ్చిన పిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రారంభించారు



**ప్రజా బలం ములుగు ప్రతినిధి**

తేదీ 17 మార్చి 202

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయము -ములుగు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం లోని భాగంగా కంటి సెలు కంటి చూపు లోపాలను గుర్తించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు ,కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రారంభించారు. రాష్ట్రీయ బాల సస్త్య కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కంటి చేఅద్దాలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ,,విద్యార్థులను ,ఉద్దేశించి మాట్లాడుతూ,కంటిలోపాలను కంటి అద్దాలతో పాటు, పోషకాహార మైన ఆకు కూరలు, గుడ్లు ,చేపలు పాలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి రెండు ఐస్క్రీనింగ్ కార్యక్రమాలను జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల నిర్వహించి 1427 మంది పిల్లలను గుర్తించి కంటి అద్దాల కొరకు మూడవ స్క్రీనింగ్ నిర్వహించి 1219 మంది జాబితాను ప్రభుత్వానికి అందజేశాము. ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం లోని వైద్యాధికారులు మరియు సిబ్బందితో అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ జరుపుతామని డిఎంహెచ్ఓ గోపాలరావు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్బిఎస్కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రణధీర్, ములుగు ప్రధాన ఆస్పత్రి కంటి నిపుణులు డాక్టర్ ప్రవీణ్ రెడ్డి ,డెమో. సంపత్ డాక్టర్. శ్రీలత, డాక్టర్. మల్లికార్జున్ , పాఠశాలల అధ్యాపకులు, హాస్టల్ వార్డెన్ ,ఆర్ బి ఎస్ కే సిబ్బంది పాల్గొన్నారు.

# వృధాగా మిషన్ భగీరథ నీరు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 17( ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: ఆకతాయిల చేష్టలతో ప్రజలు తాగునీటి కోసం తహతహ లాడాల్సి వస్తుంది ఒకటి రెండు కాదు పైపులైను మరమ్మతులు చేసిన ప్రతిసారి పైప్ లైన్ను పగల గొట్టటం గుర్తు తెలియని దుండగులు పనిగా పెట్టుకున్నారు, ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే, అల్లాదుర్గం మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామ శివారులో,161వ జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ నీటిని పైపులైన్ ద్వారా ముస్లాపూర్ కు,సరఫరా అవుతాయి గుర్తుతెలియని వ్యక్తులు ముస్లాపూర్ గ్రామంపై కోపమో ఆకతాయిలపనో తెలియదు కానీ, ప్రతిరోజు పైపులైను పగలగొట్టడం పనిగా పెట్టుకున్నారు, పైపులైను పగల గోడుతుండడంతో, గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కాక ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది, వేసవి కాలం కావడంతో గ్రామస్తులు తమగొంతులను తడార్పుకునేందుకు పడుతున్న పాట్లు చెప్పనలివిగా లేవు పైపులైను పగిలిన చోట గ్రామస్తులు మరమ్మత్తులు చేసుకుంటే, మరుసటి రోజు అదే ప్రాంతంలో పైప్ లైన్ లీకేజీ కావడం పారి పాటిగా మారిపోయింది, అనునిత్యం పైపులైను పగలగొడుతున్న దుండగులను పట్టుకొని, కఠినంగా శిక్షించాలని, గ్రామానికి నిత్యం మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు గ్రామస్తులు వినతి చేస్తున్నారు...

## రావులపల్లి లో టెన్త్,విద్యార్థులకు ప్యాడు పెన్ను వాటర్ బాటిల్ పంపిణీ



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి(ప్రజాబలం) మార్చ్ 17**వికారాబాద్ జిల్లారా వులపల్లి గ్రామం లో గల జడ్.పి.హెచ్.ఎస్,స్కూల్ లో 10వ తరగతి విద్యార్థులకు .శివ కుమార్ పరీక్షలకు కావలసిన ప్యాడ్స్,పెన్నులు,వాటర్ బాటిల్ లు పంపిణీ చేయడం జరిగింది. అని తెలిపారుఈ యొక్క కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గొల్ల రవి,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పరి రమేష్ ,మాజీ సర్పంచ్ అబ్రహం, సీనియర్ కృష్ణారెడ్డి ,నాయకులు నడిగా వెంకట్ రెడ్డి ,నల్ల ఆనందం, చంద్రయ్య ,వినోద్ , బ్రహ్మాచారి,శేఖర్ బందయ్యపాల్గొనడం జరిగింది. అని తెలిపారు

# విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా సులభతర విద్యా బోధన.

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**పైలెట్ ప్రాజెక్టు కింద**

**నేటి నుండి జిల్లాలోని 05 ప్రాథమిక పాఠశాలలో ఏఐ ద్వారా విద్య బోధన ప్రారంభం.**

**గోవిందరావు పేట మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చల్వాయి లో ఏఐ ద్వారా బోధనను ప్రారంభించిన కలెక్టర్.**



ప్రజాబలం జిల్లా రిపోర్టర్

తేది.17.3.2025.

ములుగు జిల్లా.

ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కృత్రిమ మేధను వినియోగిస్తూ సులభతరంగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.

సోమవారం గోవిందరావు పేట మండలం చల్వాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ) తో విద్య బోధన ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు కంప్యూటర్ లో చేస్తున్న తెలుగు, ఆంగ్లానికి సంబంధించిన ప్రమాణాలను పరిశీలించారు. గణితంలో సంఖ్యా భావనలు కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగాహారాలు, తెలుగులో విద్యార్థులు చేస్తున్న ప్రమాణాలను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఈరోజు జిల్లా వ్యాప్తంగా 05 ప్రభుత్వ పాఠశాలలో ఏఐ సహకారంతో వర్చువల్ రియాల్టీ విధానములో పాఠాలు చెప్పేలా ప్రారంభించుకున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 3 నుండి 5 తరగతి విద్యార్థులకు కనీస విద్య ప్రమాణాలు, అభ్యాసన సామర్థ్యాలను పెంచే లక్ష్యంగా ఏఐ ద్వారా బోధిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు.



ఇప్పటికే ఆరు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా కార్యక్రమాన్ని ప్రారంభించగా అక్కడ మంచి ఫలితాలు ఇచ్చినందున రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పాటు ములుగు జిల్లాలో కూడా ఈరోజు నుండి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# పదవ తరగతి విద్యార్థులతో ఇష్ట గోష్టి.

**విద్యార్థులు లక్ష్యసాధన కై శ్రమించాలి.,భయం వీడి.. పట్టుదలతో చదవాలి.**

**మంచి ఫలితాలతోనే ఉన్నత అవకాశాలు.**

**ఎస్ ఎస్ సి పరీక్షలు జీవితానికి ,టర్నింగ్ పాయింట్.**

**పదవ తరగతి పరీక్షలకు వచ్చే 4 రోజులు చాలా ముఖ్య మైనవి - బాగా చదవాలి.**

**ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి.**

**10వ తరగతిలో 100% ఫలితాలు సాధించాలి.**

**విద్యార్థుల స్టడీ అవర్స్ ను పరిశీలించిన ...కలెక్టర్.**

పదవ తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్ ను పరిశీలించి విద్యార్థులను ప్రోత్సహించి, పదవ తరగతిలో 100% ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలు అంటే భయం వీడి పట్టుదలతో చదవి మెరుగైన ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులకు, తమ ఊరికి, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చనీ తద్వారా లక్ష్యం మేరకు ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యార్థుల స్టడీ అవర్స్ తీరును గమనించి ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులతో మాట్లాడుతూ భయం వీడాలని, పరీక్షల సమయంలో మానసిక ఆందోళన పడవద్దని పరీక్షలు ప్రశాంత వాతావరణం లో రాయాలని లక్ష్యంతో చదివి తల్లిదండ్రుల కలల సహకారాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులతో కలెక్టర్ ఇస్తా గోష్టిగా మాట్లాడారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి తెలుసుకొని వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇతర వసతులను పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు.

అనంతరం జెడ్ పి హెచ్ ఎస్, కె జి వి బి స్కూలు విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ చేసి కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు కంటి లోపం లేకుండా ఉండాలంటే సమీకృత ఆహారమును తీసుకోవాలని ఎక్కువగా ఫ్రూట్స్ క్యారెట్స్ తీసుకొని ఆరోగ్యమును జాగ్రత్తగా ఉన్నట్లయితే ప్రతి కాంపిటీషన్లో సులభంగా విజయం సాధించవచ్చునని తెలిపినారు.

ఈ కార్యక్రమంలో డి ఈ ఓ పాణిని,

డా. శ్రీనివాస్, డా. జయ ప్రద,


ఎం ఈ ఓ దివాకర్, ఎం పి డి ఓ జవహర్ రెడ్డి, తహసిల్దార్ సృజన్, ఏ ఎం ఓ మల్లారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హట్కర్ సమ్మయ్య, చల్వాయి ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ముంజల విజయ, ఉన్నత పాఠశాల చైర్మన్ తెల్ల హరిత ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి కోసం బోర్ వేయించిన ఆరోగ్య శాఖ మంత్రి



**అందులో నియోజకవర్గ ప్రతినిధి మార్చి 17 ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గం లోని రాయికోడు మండల పరిధిలోగల సింగీతం గ్రామంలో ఎస్సీ కాలనీలో త్రాగునీటి కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం, ఈరోజు ఎస్సీ కాలనీలో బోర్ వేయించడం జరిగింది, గ్రామ ప్రజలు సంతోషంతో వారికి ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో రాయికోడు మండల మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రభాకర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాజిత్, నాయకులురఫిక్,శంకరయ్య స్వామి, గ్రామ యువజన సంఘాల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# బీ.ఆర్.ఎస్ పార్టీ మణికొండ నాయకులు, ప్రజల తరపున డిమాండ్


Bharatha Rashtra Samithi
Manikonda Municipality, Gandipet Mandal, R.R District

MEMORANDUM DATED 17th MARCH, 2025, SUBMITTED TO THE MUNICIPAL COMMISSIONER, MANIKONDA MUNICIPALITY, MANIKONDA

Sir,
We are constrained to bring to your notice that the BRS Party, Manikonda, has raised some unresolved public issues with you from time to time but somehow the same are yet to be resolved. Hence, the following are submitted once again for urgent redressal please.

1. Unauthorized occupation of roads in Maruthi Nagar Colony by the builders. As per the layout map the roads were clearly demarcated but we don't know why the Municipality is silent on this?
2. Restoration of old road from Puppalaguda village to Puppalaguda grave yard. Till date no efforts are made to restore the old road.
3. Baba Saheb Amedkar Bhavan in Puppalaguda. Till date no efforts are made to rectify the predecessor's mistake of ignoring Baba Saheb Ambedkar's Bhavan for which foundation stone was laid. It is very sad to note that the Architect of Indian Constitution was giventhe least priority by the Manikonda Municipality and it is nothing but insulting Baba Saheb Ambedkar.
4. Road repair works on account of laying water pipe lines and drainage pipe lines in many places especially Puppalaguda village, Nemalinagar, Panchavati Colony, Bhagya Lakshmi colony, Tanasha Nagar HUDA Colony, Lalamma Gardens, Anjali Gardens, Lakshmi Nagar, Pentaiah Nagar, Hallmark Vicinia apartments and many more places. Vehicular traffic is facing lot of difficulty in daily transportation because of road damages.
5. Halfway leaving the community hall construction in Nemali nagar.
6. Declaring 15 days leave on yearly basis apart from weekly halves to the sanitation staff, as per the GO, is not taken place yet and taking photographs of female staff while on duty is not a respectable act of this society. Hence, please take immediate necessary action in the matter to protect the dignity of women staff.
7. Irrational and unusual way of raising the property taxes from 1st October without taking the TS Municipal Act into consideration including not taking up such an important issue in the Council meetings. Also, levying interest on the early bird tax payers from 1st Nov onwards wherever taxes were raised which totally arbitrary. Hence, please necessary corrective measures to set right the irrational property tax imposed.





**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 17** మార్చి 2025 భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ నాయకులు గత కొంత కాలంగా గుడ్ మార్నింగ్ మణికొండ పేరున ప్రతి కాలనీకి, అపార్ట్మెంట్ ప్రజల వద్దకు వెళ్లి వారి సాధక బాధలను పర్యవేక్షిస్తూ ప్రజాభిప్రాయ సేకరణ చేసి సేకరించిన స్థానిక ఇబ్బందుల సమాచారం సంబంధిత అధికారులకు పిర్యాదు చేస్తూన్న దరిమిలా సోమవారం రోజున మణికొండ మునిసిపల్ కమిషనర్ ను కలసి వినతి పత్రం అందజేయడం జరిగినది:

1. అంబేద్కర్ భవనం కట్టకుండా అవమాన పరుస్తున్న అధికారులు.
2. స్మశాన వాటికకు దారి వేయని మణికొండ మునిసిపాలిటీ.
3. రెడీ మిక్స్ ప్లాంట్ వల్ల చెడిన రోడ్డును కొత్తగా వేయాలనీ డిమాండ్.
4. ముస్లిం, క్రిష్టియన్ మైనారిటీ స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలి.
5. చెప్పా పెట్టకుండా పెంచిన ప్రాపర్టీ టాక్స్ ను తగ్గించాలి.
6. మారుతి నగర్ రోడ్డు ఆక్రమణను అరికట్టాలి.
7. నెమలి నగర్ లో కమ్యూనిటీ హాలు కట్టాలి.
8. శానిటేషన్ సిబ్బందికి 15 రోజుల సెలవు ఇవ్వాలి.
9. వీధి కుక్కలకు షెల్టర్ హోమ్ కట్టాలి.

పెంటయ్య నగర్, వినాయక్ నగర్, సాయి గౌతమ్ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీలతో పాటు దాదాపు మణికొండ మొత్తంగా రోడ్డులు కడు దీనస్థితిలో చెత్తా చెదారంతో నిండి, ఎగుడు దిగుడు గుంతల మయంగా ఉన్న వాటిని బాగుచేయాలి, డ్రైనేజీ పొంగి పొర్లుతూ దుర్గందంతో పాటు దోమల నివారణ పై చర్యలు చేపట్టాలి, అన్యాక్రాంతమై మిగిలిన కొద్ది పాటి ముస్కీమ్ చెరువు అపరిశుభ్రతను తొలగించాలి, దోమల బెడద తగ్గించాలి, పై అన్ని విషయాలు పరిగణలోకి తీసుకొని స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లేనియెడల ప్రజల మద్దతుతో ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరిస్తున్నాము. ఇట్టి కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీది నరేందర్, రూపా రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, ఉపేందర్నాథ్ రెడ్డి, ముత్తంగి లక్ష్మయ్య, దిలీప్, రాజేంద్ర ప్రసాద్, కిరణ్ యాలాల, జై, సుమనళిని, భాను చందర్, రాఘవ రెడ్డి, బొడ్డు శ్రీధర్, కృపాకర్, సురేంద్ర తది తరులు పాల్గొన్నారు.

## బిసి కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

### - గ్రామాల్లో నాణ్యత కూడిన సిసి రోడ్ల నిర్మాణం

### - మార్కెట్ కమిటీ చైర్మన్, మహేందర్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి(ప్రజాబలం) మార్చి 17**వికారాబాద్ జిల్లామర్పల్లి:గత పదేళ్ల కాలంలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి న నుండి అభివృద్ధి పనులను చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ పస్సియోధిన్ లు పేర్కొన్నారు.మర్పల్లి మండల కేంద్రంలోని బిసి కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారు సీసీ రోడ్డు నిర్మాణ పనులు కొబ్బరి కాయ లు కొట్టి ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి ప్రసాద్ కుమార్ సహకారంతో మండలంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని నూతన సిసి రోడ్ల నిర్మాణంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.సిమెంటు రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కోటిగారి జగదీశ్వర్ (లడ్డు), మహిళ అధ్యక్షురాలు లక్ష్మీ, బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు రాచన్న, శేఖర్ యాదవ్ ,తక్కలి శివ, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ పాండు నాయక్, నర్సింహులు యాదవ్, సర్వేశ్, పంతులు భావి శ్రీను ముదిరాజ్, వడ్ల వెంకట్, వీరేశం, సింగురి అశోక్, పట్లుర్ మాజీ ఎంపిటిసి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

### ప్రజావాణి లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### మొత్తం 113 దరఖాస్తుల రాక



**రాజన్న సిరిసిల్లజిల్లా, మార్చి -17(ప్రజాబలం ప్రతినిధి)**ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖకు 49, సిరిసిల్ల మున్సిపల్ కు 11, ఉపాధి కల్పన శాఖకు 6, జిల్లా సంక్షేమ అధికారికి 5, విద్యాశాఖ కు 4, సర్వే శాఖ, చందుర్తి ఎంపీడీఓ కార్యాలయం, ఎస్డిసీకి మూడు చొప్పున,నీటి పారుదల శాఖ, వేములవాడ మున్సిపల్, సెస్ కార్యాలయానికి రెండు చొప్పున, కార్మిక శాఖ, ఇంటర్మీడియట్ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, అటవీ శాఖ, ఎస్పీ ఆఫీస్, ఎస్సీ కార్పొరేషన్, ఎంపీడీవో ముస్తాబాద్, కోనరావుపేట, గిరిజన అభివృద్ధిశాఖ, జిల్లా వైద్యాధికారి, డీపీఆర్ఈ, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, ఈడీఎం, హాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్, జిల్లా పంచాయతీ అధికారి, దేవాదాయ శాఖ, ఎక్సైజ్ శాఖకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 113 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో డీఆర్డీఓ శేషాద్రి, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం అందించడంలో అలసత్వం తగదు ::జిల్లాకలెక్టర్సందీప్ కుమార్ ఝా

### వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**వేములవాడ .మార్చి-17(ప్రజాబలం నియోజకవర్గ ప్రతినిధి)**పేషెంట్లకు వైద్యం అందించడంలో అలసత్వం ప్రదర్శించవద్దని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.సోమవారం వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రి లోని అన్ని విభాగాలను, రోగులకు సేవలు అందిస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రతీ విభాగాన్ని కలియ తిరిగి వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న తీరుని కలెక్టర్ పర్యవేక్షించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. రిజిస్టర్లు, ఔట్ పేషెంట్, ఐపి వార్డు, పిడియాట్రిక్ వార్డు, ల్యాబ్, ఫార్మసీ, ఐసీయూ, డయాలసిస్ విభాగాలను పరిశీలించి, మీ సమస్య ఏమిటి? ఎక్కడి నుండి వచ్చారు? ఏ విధంగా వైద్య సేవలు అందిస్తున్నారు అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి భవన నమూనాలో పేర్కొన్న విధంగా వార్డులు, గదులను సక్రమంగా వినియోగించాలని సూచించారు. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.తనిఖీలో పర్యవేక్షకులు డా.పెంచలయ్య, వైద్య సిబ్బంది ,అధికారులు తదితరులు ఉన్నారు.

## మహిళలు తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

### స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధరావత్ చంద్రకళ

### ఘనంగా విశిష్ట మహిళా రమాబాయి అంబేద్కర్ పురస్కారం వేడుకలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్, మార్చి 17**:ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఘనంగా పట్టణంలోని శ్రీ మంజునాథ గార్డెన్ లో విశిష్ట మహిళ అంబేద్కర్ పురస్కారం 2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంచిర్యాల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీమతి ధరావత్, చంద్రకళ మాట్లాడుతూ మహిళలు ఎదగాలని ఎన్ని అడ్డంకులు ఎదురొచ్చినా వాటిని అధిగమించి ముందుకు సాగాలని ఆమె అన్నారు. మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతుందని మహిళలు ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడు మహిళా సాధికారిక సాధ్యమవుతుందని ఆమె పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ గాజర్ల దేవేందర్ మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించాలని అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే మరింత మందికి మహిళలకు అవకాశాలు వస్తాయని ఆయన తెలిపారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి శ్రీమతి నీరటి రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలు ఏటెండర్ నుండి అంతరిక్షం వరకు పురుషులతో సమానంగా ఎదుగుతున్నారన్నారు. మగువలకి ప్రోత్సాహం లభిస్తే ఏ స్థాయిలోనైనా రాణిస్తారని అవకాశాలను అంది పుచ్చుకొని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం ఆయా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 25 మంది మహిళలకి విశిష్ట మహిళా రమాబాయి అంబేద్కర్ పురస్కారం 2025 అవార్డులను అతిధిః లచే అందించారు. ఈ కార్యక్రమానికి ఉప్పులేటి నరేష్ అధ్యక్షత వహించగా ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ శ్రీమతి డాక్టర్ గడప మానస, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, జిల్లా కన్వీనర్ నెరువట్ల రాజలింగు, కోకన్వీనర్ లు కొల్లూరి రవికుమార్, ఆసంపల్లి శ్రీనివాస్, దర్శనాల నవీన్, శ్రీమతి బండ శాంకరి, శ్రీమతి ఉప్పులేటి గోపిక, చిలుక శేఖర్, అంతర్పుల మధు లు పాల్గొనగా చిన్నారులు అమూల్య, బ్రింద, తపస్య, విష్ణు ప్రియ, శార్వాణి బృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.







## జాతీయస్థాయి ప్రతిభ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చ్-17 (ప్రజాబలం ప్రతినిధి)** జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఇద్దరు మహిళలను అభినందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఈనెల 20 నుండి 27 వరకు ఢిల్లీలో జరుగుతున్న ఖేలో ఇండియా సారా గేమ్స్ కు మిట్టపల్లి అర్చన(చంద్రంపేట) స్త్రీ 46 విభాగంలో, భూక్య సక్కుబాయి (గర్జనపల్లి) స్త్రీ 40 విభాగంలోఎంపిక కావడం జరిగింది. జాతీయస్థాయిలో ప్రతిభ దాటిన ఇద్దరు మహిళలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా యువజన క్రీడల అధికారి రాందాస్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, అభినందించడం జరిగింది.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

## గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 18 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్.



**రాజన్న సిరిసిల్ల జిల్లా,మార్చ్-17 (ప్రజా బలం ప్రతినిధి)**ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 18 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## బిజిగిరి షరీఫ్ దర్గాను సందర్శించిన సబ్బని వెంకట్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మార్చి 17** హుజురాబాద్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అత్యంత ప్రసిద్ధిగాంచిన జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ లోని హజ్రత్ సయ్యద్ ఇంకెషావలి అలీ దర్గా ను సామాజికవేత్త జెన్ ప్యాక్ కంపెనీ వైస్ చైర్మన్ సబ్బని వెంకట్ సందర్శించారు.ఈ సందర్భంగా దర్గా కమిటీ వారు ఘన స్వాగతం పలికి మత గురువు మహమ్మద్ యాసిన్ తో ప్రత్యేకమైన ఫాతిహా ఖానీ(ప్రత్యేక పూజ) జరిపించారు. అనంతరం దర్గా కమిటీ వారు అభివృద్ధి కొరకు పలు పనులను సబ్బని వెంకట్ దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించి 50 బస్తాల సిమెంటును అందజేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో బిజిగిరి షరీఫ్ దర్గా అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అధ్యక్షులు మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో సబ్బని వెంకట్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట బిజిగిరి షరీఫ్ గ్రామ ప్రజలు, ముస్లిం సోదరులు తదితరులు ఉన్నారు.

# పాత్రికేయునీ కుటుంబాన్ని పరామర్శించిన సబ్బని వెంకట్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మార్చి 17** జమ్మికుంట మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన పాత్రికేయుడు దొడ్డే రాజేంద్రప్రసాద్ తండ్రి దొడ్డ నర్సయ్య ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి సామాజికవేత్త, జెన్ ప్యాక్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్ పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిపోతోంది

### ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సౌర ఫలకాలు ఏర్పాటు
### పంప్డ్ స్టోరేజ్, ఫ్లోటింగ్ విద్యుత్ ప్రోత్సాహానికి చర్యలు
### ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 17** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిపోతోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తున్నామని, పంప్డ్ స్టోరేజ్, ఫ్లోటింగ్ విద్యుత్ ప్రోత్సాహానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రూ. లక్ష కోట్ల మేర పెట్టుబడులకు సంస్థలతో ఎంవోయూలు ఉన్నాయన్నారు. కాలుష్య రహిత, తక్కువ ధరకు విద్యుదుత్పత్తికి దోహదం చేస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.వినూత్న పరిష్కారాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల పెంపునకు క్లీన్ ఎనర్జీ పాలసీ-2024ను ఆవిష్కరించారు.ఆ తర్వాత, ఈ లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్రం స్వతంత్ర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, తేలియాడే సౌరశక్తి, వ్యర్థాల నుండి శక్తి, గ్రీన్ హైడ్రోజన్ వంటి 2030 నాటికి 20 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి, 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారని భట్టి చెప్పారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను ప్రోత్సహించడానికి పాలసీ తెచ్చామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిపోతోందని తెలియజేశారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తున్నామని, పంప్డ్ స్టోరేజ్, ఫ్లోటింగ్ విద్యుత్ ప్రోత్సాహానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రూ. లక్ష కోట్ల మేర పెట్టుబడులకు సంస్థలతో ఎంవోయూలు ఉన్నాయన్నారు. కాలుష్య రహిత, తక్కువ ధరకు విద్యుదుత్పత్తికి దోహదం చేస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు



**ప్రజాబలం ప్రతివీధి నిర్మల్ జిల్లా..** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో నిర్మల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు.రైతు రుణమాఫీ,విద్య, వైద్యం,వ్యవసాయం, పింఛన్లు,ధరణి,భూ సమస్యలు,డబుల్ బెడ్ రూమ్ రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు,సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈరోజు ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 86 అర్జీలు వచ్చాయని తెలిపారు.శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు.

ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నందున,జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. వడదెబ్బతో అనారోగ్యానికి గురై ఆసుపత్రులకు వచ్చే రోగులకు అన్ని రకాల మందులు,సెలైన్ బాటిళ్లు ఓఆర్ఎస్ పొట్లాలు తగినన్ని అందుబాటులో ఉంచాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు. జిల్లాలో కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పోనికి కర్రను సమకూర్చుకోవడానికి పోనికి వనాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు డిఆర్డిఓ విజయలక్ష్మి ని కలెక్టర్ అభినందించారు.జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన స్టీల్ నీళ్ల సీసాలను కలెక్టర్ అధికారులకు అందించారు.ప్లాస్టిక్ వాడకం తగ్గించడంలో భాగంగా స్టీల్ నీళ్ళ సీసాల వైపు మళ్లిన అధికారులను కలెక్టర్ అభినందించారు. అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని ఈ కలెక్టర్ సందర్భంగా తెలిపారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,ఆర్డిఓ రత్నకళ్యాణి,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## జమ్మికుంట నుండి హైదరాబాద్ కు బస్సు పునరుద్ధించండి సిపిఎం పార్టీ మండల సహాయ కార్యదర్శి వడ్లూరి కిషోర్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మార్చి 17** జమ్మికుంట పట్టణం నుండి హైదరాబాద్ కు బస్సు పునరుద్ధించాలని సిపిఎం మండల సహాయ కార్యదర్శి వడ్లూరి కిషోర్ తెలిపారు. సోమవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో కార్యాలయంలో డిపో మేనేజర్ రవీంద్రనాథ్ కి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం కిషోర్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణం నుండి జమ్మికుంట చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు వివిధ అవసరాల కోసం ఆసుపత్రుల కోసం నిత్యం హైదరాబాద్ కు వెళ్తున్నారని అన్నారు. గతంలో ముద్దసాని దామోదర్ రెడ్డి హయాంలో చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా బస్సు సౌకర్యం హైదరాబాదుకు ఉండేదని గత రెండు మూడు సంవత్సరాల నుండి బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జమ్మికుంట పర్యటన సందర్భంగా హామీ ఇచ్చారని హామీ ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఇంతవరకు బస్సు పునరుద్ధించలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రజల సౌకర్యార్థం జమ్మికుంట పట్టణం నుండి హైదరాబాద్ కు బస్సు సౌకర్యం కల్పించాలని లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే రమేష్,అరవింద్,లతో పాటు తదితరులు పాల్గొన్నారు

# ఒల్డ్ కలెక్టర్ కార్యాలయం ముందు రెండు రోజులు నిర్వహించే ధర్నాకు సిపిఎం సంపూర్ణ మద్దతు




**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు రెండు రోజులు నిర్వహిస్తున్న ధర్నాకు సిపిఎం పార్టీ నిర్మల్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ హాజరై మాట్లాడడం జరిగింది .కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయిపోయింది ప్రజలకు ఇచ్చిన కార్మికులకు ఇచ్చిన ఉద్యోగులకు ఇచ్చినటువంటి వాగ్దానాలు వాగ్దానాలు గానే మిగిలిపోయాయి. ఈ ఎన్నికల్లో మేము గెలిస్తే అంగన్వాడీ టీచర్లకు 18000 వేతనం ఇస్తానని చెప్పి ప్రకటించారు. కానీ ఆ డిమాండ్ ని ఏమాత్రం పట్టించుకోకుండానే సంవత్సరం గడిపారు. ఈ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా కార్మికులకు ఉద్యోగులకు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడం కోసం నిర్ణయాలు చేయాలని ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.18 వేల రూపాయల వేతనం వెంటనే పెంచి ఇవ్వాలని, అంగన్వాడీలకున్న సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేయడం జరిగింది.అంగన్వాడీలకు మద్దతుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్లి అంగన్వాడి యూనియన్ నాయకులు పాల్గొన్నారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com